ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, ఏప్రిల్ 12, 2026 | సంపుటి - 22 | సంచిక 195 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## రాహుల్‌తో మోడీ సంభాషణ

- ప్రేరణా స్థల్ వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన ఇరు నేతలు
- మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా..



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 11(నినాదం):**

మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారం నాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించు కున్నారు.

▸▸తరువాయి 2లో..

నేడు ఇంటర్ ఫలితాలు

## విడుదల

అధికారికంగా ప్రకటించిన బోర్డు




2

13 నుంచి 18 వరకు

## అరైవ్, అలైవ్..

ప్రజాపాలనలో రోడ్డు భద్రతపై చైతన్యం: డిజిపి



2

హైవేపై నిలిపిన

## వాహనాలే టార్గెట్

- డీజిల్ దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు
- వేయి లీటర్ల డీజిల్ సహా వాహనాలు స్వాధీనం



నియోజకవర్గాల పునర్విభజనలో

# అంతరం

**దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచే కుట్ర**

**2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు**

- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి





*కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.*

*2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్రు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు.*

**హైదరాబాద్,ఏప్రిల్11(నినాదం):**

శనివారం డిప్యూటీ సీఎం భట్టి రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. 2లో..

పంటకొనుగోళ్లలో

## తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట, ఏప్రిల్ 11(నినాదం):**

పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆరఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు.

2



తెలుగు రాష్ట్రాల

## ఐటిడిఎల బలోపేతం

**ఒకరోజు కార్యశాలలో కేంద్ర డైరెక్టర్ సమీక్ష**



**హైదరాబాద్,ఏప్రిల్ 11(నినాదం):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల బలోపేత చర్యలపై కేంద్ర ప్రభుత్వం, గిరిజన మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ లోని మాసబ్ టాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్యశాల నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా హాజరయ్యారు. 2లో..

ఎప్పుడు ఎన్నికలొచ్చినా..

## అవి కెసిఆర్ ఎన్నికలే

- కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు
- అనేక హామీలతో డబ్బా కొటటఇన రేవంత్
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్



*ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.*

**హైదరాబాద్,ఏప్రిల్ 11(నినాదం):**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆరఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు ▸▸తరువాయి 2లో..

పూలే ఆశయాలకు

## కాంగ్రెస్ తూట్లు

- విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం
- అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ
- కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు.

**హైదరాబాద్,ఏప్రిల్ 11(నినాదం):**

2

ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు.





## అమీన్పూర్‌లో కూల్చివేతలు..

- ప్రభుత్వ భూములను కాపాడుకునే చర్యలు
- రెవెన్యూ, హైడ్రా సిబ్బంది సుమారు 2,000 మందితో ఆపరేషన్

8

**అమీన్‌పూర్, (నినాదం): మండలంలోని శనివారం ఉదయం, సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో నిర్వహించిన భారీ కూల్చివేతలు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో రెవెన్యూ, హైడ్రా సిబ్బంది, పోలీసు బందోబస్తు కలిపి సుమారు 2,000 మంది పాల్గొన్నారు.**

మా వద్ద నాణ్యమైన

## చమురు ఉంది

**కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు**

**వాషింగ్టన్, నినాదం:** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు.

2



## క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్

- ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి
- కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట'
- శిక్షణ తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు

**అమరావతి,ఏప్రిల్11(నినాదం):**

పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు.



విజయ్ 'జననాయగన' లీక్‌తో

## బిజెపికేం సంబంధం

- కేంద్రమంత్రి మురుగన్‌పై ఆరోపణలు సరికాదు
- నేనూ విజయ్ అభిమానినే అన్న అన్నామలై

2

**కోయంబత్తూరు, నినాదం:**

సెన్సార్ బోర్డు సమస్యలతో విడుదలలో జాప్యమైన విజయ్ 'జననాయగన' సినిమా ఇప్పుడు థియేటర్‌కు రాకుండానే ఇంటర్‌నెట్‌లో లీక్ కావడం హాట్‌టాపిక్ అయింది. దీనిపై దక్షిణాది పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించారు.



200కు పైగా

## సీట్లలో గెలిస్తున్నాం

- ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు
- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ధీమా

2

**చెన్నై, నినాదం:**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు.



## రాహుల్‌తో మోడీ సంభాషణ

తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్న తరుణంలో ప్రధాని, ప్రతిపక్ష నేత పరస్పరం సంభాషించుకోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటీవల కాలంలో పలు పబ్లిక్ స్పీచ్‌లు, రాజకీయ ర్యాలీల్లో మోడీ, రాహుల్ మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. మోడీ రాజీపడే నేత అని, మన విదేశాంగ విధానం మోడీ పర్సనల్ పాలసీగా మారిందని, ఆయన ఏమి చేయాలో ఏమి చేయకూడదో ట్రంప్ నిర్దేశిస్తున్నారని రాహుల్ విమర్శలు గుప్పించారు. రాహుల్ విమర్శలను మోడీ తిప్పికొట్టుతూ, ఆయనొక స్వయం ప్రకటిత రాకుమారుడని చురకలు వేశారు. తాజాగా వీరిద్దరు ముచ్చటించుకోవడం ఆసక్తికర పరిణామంగా చెప్పుకోవాలి.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సాప్‌లో పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్' అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## 13 నుంచి 18 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం

**హైదరాబాద్, నినాదం:**

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన 'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మరణిస్తున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్ నుంచి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీ 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## హైవేపై నిలిపిన వాహనాలే టార్గెట్

**నల్గొండ, నినాదం:**

రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్

రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్దే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆరఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఇ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఇ3 ప్రొగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## విజయ్ 'జననాయగన' లీక్‌తో బిజెపికేం సంబంధం

దీనికి తాజాగా రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. ఈ చిత్రం ఆన్‌లైన్‌లో లీక్ కావడం వెనుక కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాత్ర ఉందంటూ టీవీకే ఆరోపణలు చేసింది. అయితే ఈ రోపణలను తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై వెంటనే ఖండించారు. ఇవి రాజకీయ దిగజారుడు ఆరోపణలుగా కొట్టివేశారు. 'జననాయగన' సినిమా లీక్ కావడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఈ చిత్రం పైరేటెడ్ వెర్షన్‌కు ప్రజలు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూరులో పార్టీ అభ్యర్థి తరఫు ప్రచారం సాగిస్తున్న అన్నామలై శనివారంనాడిక్కడ విడియాతో మాట్లాడుతూ, ఈ వివాదంలోకి బీజేపీని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. సినిమాల విడుదల, లీక్ వ్యవహారాల్లో పార్టీకి ఎలా ప్రమేయం ఉంటుందని నిలదీశారు. వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీని ఇందులోకి లాగడం సరికాదని చెప్పారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్న మురుగన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)పై తన పరపతిని ఉపయోగించి సినిమాను లీక్ చేయించారని ఈనెల 10న టీవీకే నేత ఆధవ్ అర్జున ఆరోపించారు. థియేటర్‌లో విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో సినిమా లీక్ అయ్యేందుకు ఆయన ఉదయనిధి స్టాలిన్ సహకారం తీసుకున్నారని అన్నారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ, టీవీకే మద్దతుదారులు, నేతలు కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం

దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56? మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందని తెలిపారు. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారు ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపాం, ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవరంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.



## పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరి దాకా క్రుషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

### బీఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

**కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ - టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

ములుగు, నినాదం: కాంగ్రెస్ నుంచి బీఆరఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆరఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆరఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే బిఆరఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆరఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు.

## మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

**చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు**

ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జెరెడ్ కుష్నర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ విడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ విడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా..అవి కెసిఆర్ ఎన్నికలే



సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుం టున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మీదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏవి లేదన్నాడు. వి ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా వి కే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీం పట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా వికే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తద్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

## తెలుగు రాష్ట్రాల ఐటిడిఎల బలోపేతం

సమావేశంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేస్తూ డా. వి. సముజ్వల, సంచాలకులు, గిరిజన సాంస్కృతిక శిక్షణా సంస్థ ఈ కార్యశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి హాజరైన గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఎ అధికారులకు స్వాగతంపలికారు. ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలలో తేడాలు, నిధుల వినియోగ విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని భావించారు. గిరిజన ప్రాంతాలలో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువతకు శిక్షణ అందించడం పై చర్చ జరిగింది. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషలలో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, మరియు ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో 100శాతం ఎస్సెస్సీ ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు. అంతేకాక, గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాల అభివృద్ధిపై చర్చించారు.

## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.



పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ఫైర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



## యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలో "ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్'పై

# నేషనల్ ఆటిజం స్టేక్ హోల్డర్స్ సమ్మిట్

**ఆటిజం సంరక్షణను బలోపేతం చేయడమే లక్ష్యం**

**న్యూరోడైవర్సిటీకి ప్రోత్సాహం అందించేందుకు జాతీయ స్థాయి సదస్సు**





**హైదరాబాద్, ఏప్రిల్ 11, (నినాదం):** ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్‌పై అవగాహనను పెంపొందించడం మరియు సమగ్ర విధాన పరమైన మార్పులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో యశోద హాస్పిటల్స్ -- హైటెక్ సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసెబిలిటీస్ సహకారంతో నేషనల్ ఆటిజం స్టేక్ హోల్డర్స్ సమ్మిట్ - 2026ను నిర్వహించింది. ఈ రెండు రోజుల జాతీయ సదస్సు ఆటిజం సంరక్షణ మరియు సాధికారతను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్, శ్రీమతి హరిచందన దాసరి, IAS, హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ రెండు రోజుల జాతీయ సదస్సు ఏప్రిల్ 11 మరియు 12, 2026 తేదీలలో యశోద హాస్పిటల్స్ - హైటెక్ సిటీలోని 5వ అంతస్తు ఆడిటోరియంలో నిర్వహించబడింది. దేశవ్యాప్తంగా 500 మందికిపైగా ప్రముఖ పిల్లల నాడీ వైద్య నిపుణులు, న్యూరోసైంటిస్టులు, థెరపిస్టులు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ఆటిజం ఉన్న వ్యక్తుల కుటుంబ సభ్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సు యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, మెడికల్ సర్వీస్, డాక్టర్. ఎ. లింగయ్య , అలాగే పీడియాట్రిక్ న్యూరోసైన్సెస్ విభాగం డైరెక్టర్ మరియు చైల్డ్ అండ్ అడోలసెంట్ న్యూరాలజిస్టు డాక్టర్. లోకేష్ లింగప్ప మార్గదర్శకత్వంలో, NIEPID డైరెక్టర్ డాక్టర్. బి.వి. రామ్ కుమార్ సహకారంతో నిర్వహించబడింది. ఆర్గనైజింగ్ కమిటీలో డెవలప్మెంటల్ పీడియాట్రిషన్ మరియు జజజ క్లినికల్ ఇన్‌చార్జ్ డాక్టర్. అమూల్య మైసూర్, మెడికల్ జెనెటిస్ట్ డాక్టర్. సారా బైలూర్ , సీనియర్ క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్. సోమశేఖర్ ఉన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్, శ్రీమతి హరిచందన దాసరి, IAS , మాట్లాడుతూ, నేషనల్ ఆటిజం స్టేక్ హోల్డర్స్ సమ్మిట్-2026లో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆటిజం అనేది కేవలం వైద్య సమస్య మాత్రమే కాదని మానవ మేధస్సు వైవిధ్యానికి ప్రతిబింబమని ఆమె పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి రంగాల్లో సమగ్ర విధానాలను అమలు చేయడం ద్వారా అవగాహన దశను దాటి ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు సమాన అవకాశాలతో కూడిన సమగ్ర సమాజ నిర్మాణానికి దోహదపడతాయని ఆమె తెలిపారు. అదే రోజున, పిల్లల అభివృద్ధి మరియు ప్రవర్తనా సమస్యల ప్రారంభ గుర్తింపు మరియు చికిత్స కోసం అత్యాధునిక సదుపాయాలతో రూపొందించిన చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కేంద్రం పిల్లలు మరియు వారి కుటుంబాలకు అంచనా, థెరపీ మరియు నిరంతర సహాయం అందించేందుకు మల్టీడిసిప్లినరీ నిపుణులను ఒకచోట చేర్చిందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్, శ్రీమతి హరిచందన దాసరి, IAS, తెలిపారు.

ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, మెడికల్ సర్వీస్, డాక్టర్. ఎ. లింగయ్య మాట్లాడుతూ, ఆటిజాన్ని సమాజం మొత్తం బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉందని, అవగాహన, ప్రారంభ నిర్ధారణ మరియు నాణ్యమైన చికిత్సపై మరింత దృష్టి పెట్టాలని అన్నారు. ఆటిజం సంరక్షణలో మల్టీడిసిప్లినరీ విధానం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులు నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడికి వేదికగా నిలిచి, మెరుగైన చికిత్స ఫలితాలకు దారితీస్తాయని తెలిపారు. విద్య మరియు ఉపాధిలో అందుబాటు, సమగ్ర విధానాలు మరియు సామాజిక అంగీకారం ద్వారా ఆటిజం ఉన్న వ్యక్తులను సాధికారత కల్పించాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ఈ సమ్మిట్ ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. యశోద హాస్పిటల్స్ -- హైటెక్ సిటీలో సీనియర్ చైల్డ్ అండ్ అడోలసెంట్ న్యూరాలజిస్టు డాక్టర్. లోకేష్ లింగప్ప మాట్లాడుతూ, ఆటిజం వంటి సంక్లిష్ట న్యూరోడెవలప్మెంటల్ సమస్యలు తొలిదశలో గుర్తింపు మరియు సమగ్ర చికిత్స ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రారంభ దశలో చేసే జోక్యం పిల్లల అభివృద్ధి మరియు జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుందని చెప్పారు. ఈ సమ్మిట్ వైద్య నిపుణులు, విద్యావేత్తలు, విద్యార్థులు మరియు కుటుంబ సభ్యులను ఒకచోట చేర్చి, ఆరోగ్యం, విద్య మరియు విధాన రంగాల్లో సహకారాన్ని పెంపొందించే ఒక ముఖ్య వేదికగా నిలిచిందని డాక్టర్. లోకేష్ లింగప్ప పేర్కొన్నారు.


**IN THE COURT OF HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT: MALKAJGIRI**
**O.S No. 133 OF 2026**

BETWEEN:-
1. Chokkavarapu Bhaskar, S/o. Late Chokkavarapu Sattaiah
2. Chokkavarapu Nagaraju Rao, S/o. Late Chokkavarapu Sattaiah
**...PLAINTIFFS**

**AND**
1. The Tashildhar, Alwal Mandal Office, M.M.Dist.
2. To all concerned
**...DEFENDANTS**

To,
All Concerned whomsoever it may concern whereas Plaintiffs have filed above Suit against the defendants for declaration to declare themselves as legal heirs of SriLate Chokkavarapu Sattaiahwho died on 25/04/2012.
Take notice that the above case is posted to **30-04-2026 at 10-30 A.M** for appearance of Defendants and filing objection or claims if any, in default the case will be decided on ex-parte in accordance with law.

**// BY ORDER OF THE HON'BLE COURT //**
Sd/-
**K. DILEEP REDDY**
**CH.NAVEEN REDDY,**
**Advocates**
#2-4-29/44/1, Anjanapuri Colony, Behind Select Talkies, Old Alwal, Secunderabad-500010
Cell: 9848753897


## రియాబిటేషన్ మెరుగైన వైద్యం అందించాలి

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం):** మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి లోని మత్తు విముక్తి విభాగాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన మత్తు విముక్తి కేంద్రంఇంచార్జ్ డాక్టర్‌తో మాట్లాడి, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, చికిత్స విధానం, కౌన్సెలింగ్, మందుల పంపిణీ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంచార్జ్ డాక్టర్ అనిల్ సమాధానమిస్తూ, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కౌన్సెలింగ్‌తో పాటు, మెడికల్ చికిత్స అందిస్తూ వారిని శ్రద్ధగా చూసుకుంటున్నామని తెలిపారు. తదుపరి కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. కత్తుల శేఖర్ అనే రోగితో మాట్లాడుతూ ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకు మద్యం అలవాటు చేసుకున్నారు? అని అడిగి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే శాలీ లింగోటం గ్రామానికి చెందిన పరుష రాముడు తో మాట్లాడారు. తాను వ్యక్తిగత సమస్యల వల్ల మద్యానికి అలవాటు పడినట్లు చెప్పగా, అలాంటి సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఏఎస్‌పి రమేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ సంపత్, డి.ఎస్.పి శివరాం రెడ్డి, జి జి హెచ్ సూపరింటెండెంట్ నేత నరసింహారావు ,ఇంచార్జ్ డాక్టర్ జోష్ణ, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## జేఆర్ కాంప్లెక్స్ శిలాఫలకం ధ్వంసం

**పోలీసు స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**



**అమరచింత, ఏప్రిల్ 11, (నినాదం):** అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని జేఆర్ కాంప్లెక్స్ శిలాఫలకాన్ని పట్టణానికి చెందిన మైకుల మైమూద్ అనే వ్యక్తి ధ్వంసం చేయడం కలకలం రేపింది. గత రెండు సంవత్సరాల క్రితం మైనారిటీ కమ్యూనిటీ భవన కాంప్లెక్స్ నిర్మాణాన్ని అప్పటి మక్తల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. శనివారం పట్టణానికి చెందిన మైకుల మైముద్ శిలాఫలకాన్ని అందరూ చూస్తుండగానే సుత్తితో ధ్వంసం చేశాడు. ఈ తతంగం అంతా అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీశారు. విషయం తెలిసిన బిఆర్ఎస్ నాయకులు అక్కల నరసింహులు గౌడ్ చిన్న బాలరాజు మాజీ కౌన్సిలర్ లెనిన్ రాజకుమార్ మరికొంతమంది నాయకులు తో కలిసి ఎస్సై స్వాతికి ఫిర్యాదు చేశారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేరు శిలాఫలకంపై ఉండడం జీర్ణించుకోలేకనే కొందరు పని కట్టుకొని ఈ ఘటనకు పాల్పడినట్లు నాయకులు ఆరోపించారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

## ఘనంగా పూలే జయంతి వేడుకలు



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 11 (నినాదం):** మహాత్మ జ్యోతిరావు పూలే 200 వ జయంతి వేడుకలు యాదవ్ నల్లగొండ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి అలాగే గడియారం సెంటర్లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పూలే , సమ సమాజ స్థాపన కోసం, మహిళల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన ఎంతో కృషి చేశారు. అటువంటి మహానాయకుడి స్ఫూర్తితో అంబేద్కర్ పెరియార్ రామస్వామి ,జగజీవన్ రామ్ లాంటి మహామహులు ఈనాడు బడుగు బలహీన వర్గాల కోసం అనేక రకాలుగా వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. అందులో భాగంగానే ఆనాడు చీరామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లో పెట్టుబడిదారుల పాలన నడుస్తున్న సందర్భంలో బడుగు బలహీన వర్గాల కోసం, సామాజికంగా రాజకీయంగా వారు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చారు. పూలే ఆశయ సాధన కోసం రాజకీయాల్లో 33% స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించి బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ చైతన్యం కల్పించింది, రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాల వారు ఉన్నత స్థాయికి చేరాలని తెలుగుదేశం పార్టీ కృషి చేయడం జరిగింది. అదేవిధంగా చంద్రబాబు నాయుడు గారు కూడా అదే బాటలో ఈనాటి వరకు కూడా బడుగు బలహీన వర్గాల వారి కోసం నిరంతరం కృషి చేస్తూ అనేక రంగాల్లో సామాజిక రాజకీయ రంగాల్లో, బడుగు బలహీన వర్గాల వారికి ఎంతో అభివృద్ధికి కృషి చేశారన్నారు . కార్యక్రమం లో కూరెళ్ల విజయ్ కుమార్, గుండు వెంకటేశ్వర్లు, గంగాధర్ స్వరాజ్, గోవిందు బాలరాజు, దాడి మధుసూదన్ రెడ్డి, ఆరేళ్ల కొండలు, వీర్ల పరమేష్, చిందాల సంపత్, మహేశ్వరం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఆశా స్ఫూర్తితో పనిచేద్దాం

**• కలెక్టర్ బి.చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం):** సమానత్వం, సామాజిక న్యాయం ,నాణ్యమైన విద్య కై కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాల స్ఫూర్తి భావితరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే "ద్వి శతాబ్ది" ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ఆహుతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల వారి అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ప్రత్యేకించి విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ లతోపాటు, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వసతి గృహాలలో ఇంకా సౌకర్యాలు అభివృద్ధి చేయాల్సి ఉందని ఆయన చెప్పారు. విద్యాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని, ఇందులో ఒకేసారి 2,600 పిల్లలు చదువుకోవచ్చని అన్నారు. అలాగే నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు. ఈ పాఠశాలలో విద్యార్థులు ఇంటి వద్ద నుండి బస్సులో తీసుకువెళ్లే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. వెనుకబడిన తరగతుల వారికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతున్నదని, ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద జిల్లాలో 12 మందికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, అలాగే కులాంతర వివాహం చేసుకున్న 21 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందించడం జరిగిందని చెప్పారు .అలాగే వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేయాలని, ప్రశ్నించే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా శనివారం క్లాక్ టవర్ చౌరస్తానుండి నో డ్రగ్స్ క్యాంపెయిన్ కింద ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే సంఘసంస్కర్త మాత్రమే కాదని ,మహిళా చదువు కోసం పోరాటం చేసిన వ్యక్తిఅని ,సమాజంలో అందరూ సమానమని, సమానంగా ఉండాలని ఆలోచించారని మహిళా విద్యకై కృషి చేసిన మహనీయుడని ,వారి జీవిత చరిత్రను విస్తృతంగా విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలకుంటి సత్యం,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ ,వున్న కైలాస్ నేత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మరగానినవీన్ గౌడ్, అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చెక్కిలం రామరాజు ,దుడుకు లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, కొండూరు సత్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, వెంకన్న గౌడ్, భాష్పాక హరి కిషన్, చొల్లేటి రమేష్ ,కేశబోయిన శేఖర్, మిర్యాల యాదగిరి, రాపోలు పరమేష్ చిక్కాల రాములు, కంది సూర్యనారాయణ, కే శివ, కొంపల్లి బిక్షపతి, ముంతాజ్, కరుణాకర్ గౌడ్, వాసుదేవ వెంకట నరసయ్య, పంకజ్ జాదవ్ , డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ, స్థానిక తహసిల్దార్ పరశురాం ,ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ,తదితరులు హాజరయ్యారు.

# పోషణ పక్వాడాపై అవగాహన సదస్సు



**మిర్యాలగూడ, ఏప్రిల్ 11(నినాదం):** మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ రేఖల మమత ఆదేశాల మేరకు ఈనెల 9 నుండి 23 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్వాడాలో భాగంగా శనివారం ఇస్లాంపురం సెక్టర్ పరిధి సుభాష్ నగర్-2 అంగన్వాడీ కేంద్రంలో ఒక శిశువుకు 1000 రోజుల కార్యక్రమంపై సూపర్ వైజర్ కె.నాగమణి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు మెదడు ఎదుగుదల సైజు 25శాతం మాత్రమే ఉంటుంది. 2 ఏళ్లు నిండేసరికి 80శాతం వికాసం పూర్తవుతుంది. ఈ టైంలో సరైన పోషణ లేకపోతే (ఐక్యూ )నేర్చుకునే శక్తి దెబ్బతింటుంది. ఇది తర్వాత సరిచేయడం చాలా కష్టమన్నారు. పుట్టినప్పుడు 50 సీఎం ఉన్న బిడ్డ 2 ఏళ్లకు 85-90 సీఎం పెరగాలి, 1000 రోజుల్లో ఎత్తు తగ్గితే దాన్నే స్టంటింగ్ కురచతనం లేదా పొట్టి అంటారు. ఒకసారి స్టంటింగ్ వస్తే జీవితాంతం ఎత్తు తక్కువగానే ఉంటుందన్నారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే, మొదటి 6 నెలలు తల్లిపాలు తాగేటప్పుడే బిడ్డకు రోగాలతో పోరాడే శక్తి వస్తుంది, పోషకాహార లోపం ఉంటే డయేరియా, నిమోనియా జబ్బులు త్వరగా వస్తాయన్నారు. 1000 రోజుల్లో సరైన పోషణ అందితే భవిష్యత్తులో షుగర్, బీపీ, గుండె జబ్బులు, ఊబకాయం వచ్చే రిస్క్ 50శాతం తగ్గుతుందన్నారు. గర్భిణీలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, టీటీ ఇంజెక్షన్, 4 సార్లు ఎఎన్ఎం చెకప్, పాలు, గుడ్డు, ఆకుకూరలు తినడం వంటివి తీసుకోవాలి బిడ్డకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి, 0-6 నెలలు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. 6-24 నెలలు తల్లిపాలు కొనసాగిస్తూనే రోజుకు 3-4 సార్లు ఉడికిన అన్నం, పప్పు, గుడ్డు, కూరగాయలు, పండ్లు తినిపించాలన్నారు. పరిశుభ్రత చేతులు కడుక్కోవడం, మరుగుదొడ్డి వాడడం వంటివి పాటిస్తూ సురక్షిత నీరు త్రాగాలి. ఇలాంటి పద్ధతులు పాటించని యడల 1000 రోజుల్లో వచ్చే పోషకాహార లోపాన్ని తర్వాత ఎంత మంచి తిండి పెట్టినా 100శాతం సరిచేయలేం బిడ్డ జీవితంలో చదువుల్లోను, ఉద్యోగం, ఆరోగ్యం మొదటి 1000 రోజుల మీదే ఆధారపడి ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీహెచ్ఆర్, గ్రోత్ మానిటరింగ్, కౌన్సెలింగ్ ఉచితంగా దొరుకుతాయని అందరూ అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కె.నాగమణి అంగన్వాడీ టీచర్స్ ఎ.చిన్నమ్మ సిహెచ్.నర్మద పి.లత, హెల్పర్స్ ఎ.మంగమ్మ, చంద్రకళ, విజయలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు కిషోర్ బాలికలు,పెద్దలు, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

# వికలాంగుల ఆపద్బాంధవుడు రేవంతన్న

**• దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ**



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 11 (నినాదం) :** వికలాంగుల ఆపద్బాంధవుడు రేవంత్ రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ముత్తినేని వీరయ్య వర్మ అన్నారు. శనివారం కార్పొరేషన్ మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ నల్లగొండ ఆధ్వర్యంలో జిల్లాలో దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ. దివ్యాంగుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకురావడం జరుగుతుందని అందులో భాగంగా దివ్యాంగులకు పెద్దన్న లాగా పాత్ర పోషిస్తూ దివ్యాంగుల జీవితాలు వెలుగు నింపుతున్న మహనీయుడు మన ముఖ్యమంత్రి రేవంతన్న అని అన్నారు. ప్రజా ప్రభుత్వం దివ్యాంగులు దివ్యాంగులను వివాహం చేసుకున్నా కానీ 2 లక్షల రూపాయల ప్రోత్సాహం అనేది ఇవ్వడం గొప్ప నిర్ణయమని దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లను, ఉన్నత విద్యలో ఐదు శాతం రిజర్వేషన్లు ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం జీవోలను కూడా తీసుకురావడం జరిగిందని దివ్యాంగుల పెన్షన్ పెంపు కోసం కూడా తీవ్రమైనటువంటి కృషి జరుగుతుందని దివ్యాంగా సోదరులకు భవిష్యత్తులో మరిన్ని ఉచిత ఉపకరణాలను ఇవ్వడానికి కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు నల్గొండ జిల్లాలో దివ్యాంగ సోదరులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా 112 రెట్రో ఫిట్టర్ మోటర్ వెహికల్స్ ని మంజూరు చేయడం జరిగింది గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రజా ప్రభుత్వంలో ఒక సంవత్సరంలోనే దివ్యాంగులకు పెద్ద ఎత్తున ఈ కార్ట్ బండ్లు, లాప్టాప్స్, 5జి మొబైల్స్ వీల్ చైర్స్, వివిధ రాకలైన ఉచిత పరికరాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని కెవి కృష్ణవేణి వార్డెన్ వెంకటరెడ్డి సీనియర్ అసిస్టెంట్ బాలయ్య ఆఫీస్ సిబ్బంది నవీన్, సునీల్, కొత్త వెంకన్న దివ్యాంగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**• అదనపు డిసిపి ( ఎఆర్) సుభాష్ చంద్రబోస్**



**సిద్దిపేట ఏప్రిల్ 11(నినాదం):** రాజగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులతో సి.సి.టి.వి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డిసిపి (ఏఆర్) సుభాష్ చంద్రబోస్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ చేపట్టిన 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాలలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యంగా గ్రామ ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలలో తప్పనిసరిగా సి.సి.టి.వి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సి.సి.టి.వి కెమెరాలు ఉండటం వల్ల నేరాలు తగ్గుతాయని, ఒకవేళ ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి ఈ కెమెరాలు 'మూడవ కన్ను'లా పనిచేస్తాయని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని, గ్రామ రక్షణ కోసం సి.సి.టి.వి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసిపి రవీందర్ ,సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను,రిజర్వ్ ఇన్స్పెక్టర్ తిరుపతి , రాజగోపాల్‌పేట్ ఎస్సై వివేక్ , నంగునూరు మండల సర్పంచులు, ఉప సర్పంచులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులు ఫలితాలు చూసి

# ఒత్తిడికి లోనవద్దు

**మ్యాథ్స్ సజ్జల వినోబారెడ్డి**



**మిర్యాలగూడ ఏప్రిల్ 11 (నినాదం) :** నేటి ఇంటర్మీడియట్ ఫలితాలను చూసి విద్యార్థినీ విద్యార్థులకు ఎవరు కూడా ఒత్తిడికి, అసంతృప్తికి, భయాందోళనలకు గురికావద్దని ఆచార్య ఐఐటి అకాడమీ వ్యవస్థాపకులు మాథ్స్ వినోబారెడ్డి అన్నారు. సప్లమెంటరీ వారిని కూడా షార్ట్ టర్మ్ కోచింగ్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని,తక్కువ మార్కులు వచ్చిన వారిని ఎక్కువ మార్కులు వచ్చే విధంగా తయారుచేసి ,ఎంతో మంది విద్యార్థులను జీరో టు హీరోలుగా మార్చే బాధ్యతను ఆచార్య ఐఐటీ అకాడమీ తీసుకుంటుందని వ్యవస్థాపకులు మ్యాథ్స్ వినోబారెడ్డి తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని 9848418201 కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## పూలే జయంతిని విస్మరించిన అధికారులు...?



**కోదాడ, ఏప్రిల్ 11(నినాదం):** అణగారిన వర్గాల ఆశాజ్యోతి,మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నిర్వహణలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో జయంతి వేడుకలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, పలుచోట్ల ఎలాంటి కార్యక్రమాలు జరగకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేపుతోంది. అనంతగిరి మండలంలో ఈ నిర్లక్ష్యం మరింత చర్చనీయాంశంగా మారింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత మహనీయుల జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, మండల స్థాయి అధికారులు మాత్రం ఈ సంప్రదాయాన్ని విస్మరించినట్లు కనిపిస్తోంది. మండల పరిషత్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించలేదని తెలుస్తుంది. కార్యక్రమం నిర్వహించారు లేదా అని పలుమార్లు పత్రిక విలేకరులు సంబంధిత అధికారుల గ్రూపులో అడిగిన, అధికారులను చరవాణి ద్వారా అడిగే ప్రయత్నం చేసిన స్పందన లేదు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా డిప్యూటీ తహసీల్దార్ సహా కొద్దిమంది సిబ్బంది మాత్రమే పాల్గొనడం గమనార్హం. జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలకు కూడా కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఉన్నతాధికారులు గైర్హాజరు కావడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ముందస్తు ఆదేశాలు జారీ అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు లోపించడం పట్ల ప్రజా సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## అమరచింత డిఎంఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాబెటిక్ రెటినోపతి క్యాంపు



**అమరచింత, ఏప్రిల్ 11, (నినాదం):** అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యులు షుగర్ వ్యాధిగ్రస్తులకు డయాబెటిక్ రెటినో పతి క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ తార శశాంక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు జిల్లాలో మూడు టీములు ఈ క్యాంపు ఏర్పాటు చేశాయని తెలిపారు. షుగర్ పేషెంట్లకు డయాబెటిక్ రెటినోపతి ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ, మల్టీపర్పస్ సతీష్, రాము సూపర్వైజర్ ఆదిలక్ష్మి ఆప్తమెటిక్ యామిని ఏఎన్ ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వ్యసన బాధితులకు కొత్త ఆశ

## కొత్తగూడెం జీజీహెచ్‌లో అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం... రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్ 11(నినాదం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మత్తు వ్యసన నిర్మూలనకు కీలక ముందడుగు పడింది. జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్, అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ కేంద్రాల ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు, నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని అధికారులు వివరించారు. కలెక్టర్ అంకిత్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన ఒక వ్యసన బాధితుడితో మాట్లాడి, అతని పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ వ్యక్తి మద్యం మానేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం కేంద్రానికి వచ్చానని తెలిపాడు. దీనిపై స్పందించిన కలెక్టర్, బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర వైద్యం, నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు. ఇదే సందర్భంగా "డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు, శీల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి, ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాదా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

### వైద్యులతో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం)**

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లపై సూపరిండెంట్, డీఎంహెచ్ఓ, వైద్యులతో కలిసి పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సీపీ సందర్శించి అక్కడ ఉన్నటువంటి సమస్యల పైన అధికారులతో చర్చించారు. దీంట్లో భాగంగా గతంలో ఆసుపత్రిలో జరిగిన ఆత్మహత్యలకు సంబంధించి, తదుపరి ఆత్మహత్యలను నివారించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అదేవిధంగా హాస్పిటల్లో పార్కింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమెరాలు ఏర్పాటు, తదితర సమస్యలపై సవివరంగా చర్చించారు. అలాగే గతంలో జరిగిన చిన్నపిల్లల అపహారణలు, బయట వ్యక్తులు పార్కింగ్ ఏరియాలో పార్క్ చేసి వెళ్తున్న వెహికల్ లను కట్టడి చేసే విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలోని జనరల్ ఆసుపత్రి బయట ఉన్న షాప్ ల వలన ఆసుపత్రికి రావాల్సిన అంబులెన్స్ లను ఇబ్బంది ఎదురవుతుందని, ఇక పైనా అలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు.

## డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలి




### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం)**

యువత డ్రగ్స్ భారిన పడకుండా జాగ్రత్త పడాలని, ఒక వేళ డ్రగ్స్ కు అలవాటు పడితే తగిన ట్రీట్ మెంట్ తీసుకొని బయట పడాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ గదిని సీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు లకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రాజశ్రీ, డ్రగ్ ఇన్స్ పెక్టర్ శ్రీకాంత్, శ్రీలత, గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ.డి డా.నాగమోహన్, నోడల్ ఆఫీసర్ డా.రాజేందర్, సైకియాట్రిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**ఖమ్మం ఏప్రిల్ 11(నినాదం ):**



తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు, అనంతరం హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మీగడ రామారావు, లు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిరావు పూలే మహారాష్ట్రకు చెందిన గొప్ప భారతీయ సంఘ సంస్కర్త, విద్యావేత్త, సామాజిక విప్లవకారుడు స్త్రీ విద్య, దళిత సాధికారత, అంటరానితన నిర్మూలన కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని తన భార్య సావిత్రిబాయి పూలే తో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం పాఠశాలను స్థాపించారని, వారే దేశానికి మొట్ట మొదటి పంతులు పంతులమ్మ గా మారి దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, చింతనిప్పు నాగేశ్వరరావు, కన్నెటి పృధ్వీ, కోటేశ్వరరావు, మల్లెంపాటి రాము, కొండబాల అశోక్, దామాల శివ, కావూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్ట్

### కోస్గి ఎస్సై బాలరాజు

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం):**

నారాయణపేట జిల్లా, కోస్గి బస్ స్టాండ్ సమీపంలోని ఎన్. రాకేష్ అనే వ్యక్తి నివాసంలోని 3వ అంతస్తులో పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్, కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న (9) మందిని పోలీసులు పట్టుకున్నారు. రూ. 1,89,800/- నగదు, 52 ప్లేయింగ్ కార్డులు, 8 మొబైల్ ఫోన్లు, పట్టుబడిన (9) మంది నిందితులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని కోస్గి ఎస్సై బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు హెచ్చరిస్తూ, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



## జ్యోతి బా పూలే అడుగు జాడల్లో నడవాలి

### పేట కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలు

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 11, (నినాదం):**

మహాత్మా జ్యోతి బా పూలే అడుగు జాడల్లో మనమంతా నడవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి బా పూలే చిత్ర పటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతి బా పూలె జయంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పూలే సామాజిక సంస్కర్తగా, సమానత్వానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన తొలి సంస్కర్తల్లో పూలే ఒకరని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి, సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, బీసీ వెల్ఫేర్ కార్యాలయ ఉద్యోగులు ముస్తఫా, శివ, పూజారి, వసతి గృహాల వార్డెన్లు రేణుక, మంజుల, నిర్మలా, రాజేశ్వరి, యాదయ్య, రజక సంఘం నాయకులు మడివాల్ కృష్ణా,వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను ప్రభుత్వ ఖర్చు చేస్తుంది

### నగర మేయర్ నీరజ

**ఖమ్మం, ఏప్రిల్ 11 (నినాదం ):**

మహిళ అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందని ఖమ్మం నగరం మేయర్ నీరజ అన్నారు. శనివారం నగర పరిధి లోని ఐదో డివిజన్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు అందించే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేయడం సంతోషంగా ఉందని అన్నారు. దీనిలో భాగంగా మహిళలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ప్రభుత్వం ప్రతినెల రూ 290 కోట్లు తో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. ఈ పథకం ద్వారా ఆయన రంగంలో ఉన్న మహిళలు లబ్ది జరుగుతుందని అన్నారు. అదేవిధంగా మహిళలు ఆర్థిక అవసరాల నిమిత్తం ఇతరుల నుండి అప్పులు తీసుకోకుండా, ప్రభుత్వం అందిస్తున్న డ్వాక్రా పథకాలు ద్వారా లబ్ధి పొందాలని అన్నారు. మగవారికి దీటుగా మహిళా పారిశ్రామిక వ్యక్తులుగా గుర్తింపు తెచ్చే విధంగా ప్రభుత్వం చేయూతను అందిస్తుని అన్నారు. ఇలాంటి పథకాలను సద్వినియోగపరచుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని ఆమె అన్నారు. అనంతరం ప్రభుత్వం అందించిన ఇంద్రమ్మ చీరలును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, స్థానిక కార్పొరేటర్ పల్లె బోయిన భారతి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఏలూరు శ్రీనివాస్, రజిని, దానయ్య, ముఖ్య రమేష్, బాణాల లక్ష్మణరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహా యోధుడు

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం) :**

సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాయోధుడు, మహిళా అక్షరాస్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జ్యోతి బా పూలే జయంతి ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల కోసం సతీమణి సావిత్రి భాయి పూలే తో కలిసి మొట్టమొదటి పాఠశాలను నెలకొల్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రధానంగా మహిళల విద్యకు ఆయన చేసిన సేవలు అపూర్వమైనవని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాలని లక్ష్యంతో సత్యశోధ కు సమాజాన్ని స్థాపించారని గుర్తు చేశారు. ఒక మహానుభావుడిని గుర్తు చేసుకోవడం మాత్రమే కాదనీ, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ కూడా మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ప్రజలను మభ్య పెడుతుందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళిక రూపొందించకుండా మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, కార్పొరేటర్లు జ్యోతి మురళి, మల్లేష్ యాదవ్, బెల్లాల్ శశాంక్, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## లాడ్జిపై పోలీసుల దాడులు

### వ్యభిచారం నిర్వహణపై కేసు నమోదు సిఐ శివ శంకర్

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 11, (నినాదం):**

జిల్లా కేంద్రంలోని మూన్ లైట్ డార్మెటరీ లాడ్జ్ లో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారంతో నారాయణపేట పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి వ్యభిచారం నిర్వహిస్తున్న నలుగురు మహిళలను పోలీసులు పట్టుకున్నారు. అలాగే లాడ్జ్ యజమాని బుగ్గేశ్వర్ పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పట్టుబడిన మహిళలకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి అవసరమైన సహాయం అందించే చర్యలు చేపట్టారు. అనంతరం వారిని స్టేట్ హోమ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ సంతోష్, మహిళ కానిస్టేబుల్స్ శిరీష, అర్చన పాల్గొన్నారు.



## పూలే ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేద్దాం: గుంటుపల్లి

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (నినాదం )**

మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఖమ్మం లోని టీఎన్జీవోస్ యూనియన్ కార్యాలయంలో పూలె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పూలే ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే కుల వివక్ష, సామాజిక అసమాన తలపై పోరాడిన మహనీయుడని తెలిపారు. సమాజంలో సమాన త్వం నెలకొల్పడంలో, ప్రతి ఒక్కరికీ విద్య హక్కు అందించడంలో ఆయన చేసిన కృషి విశిష్టమని అన్నారు. ముఖ్యంగా మహిళా విద్యకు పూలే చేసిన సేవలు భార తదేశంలో సామాజిక మార్పుకు పునాది వేశాయని పేర్కొన్నారు. యువత పూలే గారి జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. యూనియన్ కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ, పూలే జీవితం ఒక ఉద్యమమని, ఆయన సిద్ధాంతాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, సామాజిక న్యాయం సాధనలో ఆయన ఆలోచనలు ఎంతో ఆచరణీయమని వివరించారు. ప్రస్తుత కాలంలో కూడా కొనసాగుతున్న అసమానతలను తొలగించడానికి పూలే సిద్ధాం తాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజర్ సెక్రటరీజెడ్.ఎస్. జైపాల్, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, పబ్లిసిటీ సెక్రటరీ యరా మల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షులు బెజ్జంకి ప్రభాకర చారి, రఘునా ధపాలెం యూనిట్ అధ్యక్షులు యం.వీరన్న, రూరల్ యూనిట్ అధ్యక్షులు షేక్ సైదులు, ఈసి మెంబర్ ఎన్.విజయ, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, మెడికల్ ఫోరం అధ్యక్షులు సిహెచ్. సైదులు, ఇరిగేషన్ ఫోరం అధ్యక్షులు రాజ్ కుమార్, పంచాయతీ సెక్రటరీల ఫోరం అధ్యక్షులు ఫజల్, కార్యదర్శి వినోద్, నగర నాయకులు విజయ్, జీ.వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమానత్వానికి మార్గదర్శి పూలే

### జిల్లా కలెక్టర్ అంకిత్.. ఘనంగా 200వ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్ 11(నినాదం)**

సామాజిక సమానత్వం, విద్యా వ్యాప్తి కోసం జీవితాంతం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే దేశానికి మార్గదర్శకుడిగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్, మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పడంలో జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యతనిస్తూ, ముందుగా తన భార్యకు విద్య అందించి, మహిళల సాధికారతకు పునాది వేసిన మహనీయుడు పూలే అని ఆయన పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, వారికి సామాజిక న్యాయం అందించేందుకు కొత్త దారులు చూపిన గొప్ప సంస్కర్తగా ఆయన నిలిచారని తెలిపారు. జాతి, వర్ణ వివక్షలను వ్యతిరేకిస్తూ సమాన హక్కుల సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేసిన పూలే ఆలోచనలు ఈనాటికీ ఎంతో ప్రాసంగికమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి దినేష్ ఎ.డి. మైన్స్, ఉపేందర్ ఇ.డి ఎస్.సి. కార్పోరేషన్, జి.శ్రీనివాస్ జిల్లా ఆడిట్ అధికారి సుదీర్ కుమార్ పంచాయితీరాజ్ శాఖ, జిల్లా అధికారులు, బిసి సంఘ నాయకులు కొదుమూరు సత్యనారాయణ, బొర్రా జయమ్మ గుమలాపురం సత్యనారణ, జి.కృష్ణ, ఇంద్రాల మురళి, వారాధి సత్యనారాయణ, బండి రాజుగౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## శాంతినగర్‌లో ఘనంగా పూలే జయంతి

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 11 (నినాదం)**

వడ్డేపల్లి మండలం శాంతినగర్ లోమహాత్మ జ్యోతిరావు పూలే 200 సంవత్సరాల జయంతివేడుకలు కుల నిర్మూలన పోరాట సమితి మండల కార్యదర్శి ఏ సంజీవరాజు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ఏ పరంజ్యోతి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మన జీవితాల్లో వెలుగు నింపిన మహాత్మ జ్యోతిరావు బాపూలే బాల్యదశ నుంచే మనువాదానికి వ్యతిరేకంగా చేసి స్త్రీల విద్య, దేవాలయ ప్రవేశాలు అసమానతల గూర్చి పోరాడి వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేశాడని అన్నారు. ప్రతి సంవత్సరం కేవలం ఆయన జయంతి విడత జరుపుకోవడం తో పాటు ఆయన ఆశయాలను యువత ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిఐటి సంఘం అధ్యక్షులు హమాలి భీమన్న, కెవిపిఎస్ నాయకులు శేఖర్, మున్సిపాలిటీ కార్మిక సంఘం నాయకులు పరుశరాముడు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం బుచ్చన్న, రాజు భాస్కర్, మల్దకల్, పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలతో నివాళులు

**కల్వకుర్తి ఏప్రిల్ 11 (నినాదం)**




కుల వ్యవస్థ విషవృక్షాన్ని సమూలచ్ఛేదం చేయడానికి మహోన్నత ఉద్యమం నడిపి భావితరాలకు ఆదర్శ ప్రాయుడిగా నిలిచిన సాంఘిక సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజంలో స్వార్థాన్ని విడనాడాలని లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన జయంతి వేడుకలలో కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే ఆశయాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం జ్యోతిరావు పూలే ఆశయాలతో ఆదర్శాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా ప్రక్షాళనలో భాగంగా ఎన్నో విప్లవత్మక మార్పులు తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. యూనివర్సిటీలకు తీసిపోకుండా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు తెలంగాణ వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని కానీ పూలే లాంటి మహనీయుల ఆశయాలతో నేడు తెలంగాణలో విద్యకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థులకు అల్పాహార ఏర్పాటు కూడా చేయబోతున్నామని, కాస్మోటిక్ చార్జీలను పెంచామని, ఉపాధ్యాయులకు పారదర్శక ప్రీతిలో బదిలీలు జరిపామని విద్యా ప్రక్షాళనలలో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారుఈ కార్యక్రమంలో ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య గుప్త అజీమ్ డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు వార్డు మెంబర్ మీసేవ మల్లేష్ పుట్ట పాండు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్రెడ్డి మైసయ్య యువజన కాంగ్రెస్ నాయకులు జూలపల్లి శ్రీనివాస్ జంగయ్య యాదయ్య నరసింహ చెన్నయ్య బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# రాళ్లు తీయమని పోతే ప్రాణం తీసారు!

**ఆపరేషన్‌కు ముందే మృతి..**
**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు**
**ఆసుపత్రిముందు ఆందోళన, పోలీసుల ఎంట్రీ**

కిడ్నీ రాళ్ల సమస్యతో ఆసుపత్రిలో చేరిన వ్యక్తి ఆపరేషన్‌కు ముందే మృతి చెందడం కలకలం రేపింది. ముందుగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడం కుటుంబ సభ్యులను షాక్‌కు గురిచేసింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కిడ్నీల్లో రాళ్లు తియ్యమని పోతే ప్రాణమే తీసారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



**కరీంనగర్, ఏప్రిల్ 11 (నినాదం):** పెద్దపల్లి జిల్లా పెద్ద బొంకూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్ (తండ్రి సాంబయ్య) సుల్తానాబాద్ మున్సిపాలిటీలో వార్డు అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన ఏప్రిల్ 10 ఉదయం కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్ కు కిడ్నీ రాళ్ల సమస్యతో చేరారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి రాయి పెద్దగా ఉందని, నాళంలో గొట్టం అమర్చి శస్త్రచికిత్స ద్వారా తొలగించాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్య కార్డు ఉన్నప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం రూ.30,000 బిల్లు వసూలు చేసిందని ఆరోపించారు. అదే రోజు రాత్రి ఆసుపత్రిలో ఉంచి, ఏప్రిల్ 11 ఉదయం 9 గంటలకు శస్త్రచికిత్స కోసం తీసుకెళ్లినట్లు తెలిపారు. మత్తు ఔషధం ఇచ్చిన అనంతరం శ్రీనివాస్‌కు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో అత్యవసర చికిత్స



విభాగానికి తరలించినట్లు సమాచారం. ఈ సమయంలో ఆయన కుమారుడు అక్షయ్‌కు వైద్యులు ఊపిరితిత్తుల్లో ద్రవం చేరిందని, గుండె పనితీరు సరిగా లేదని తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. పరిస్థితి విషమించడంతో గుండె స్పందన కొనసాగించేందుకు పునరుద్ధరణ చర్యలు (సీపీఆర్) చేయాల్సి వచ్చిందని, అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రకటించారు. అయితే, శ్రీనివాస్‌కు ముందుగా ఎలాంటి గుండె సంబంధిత సమస్యలు లేవని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టిన పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# హాయ్ పెట్టండి.. రిజల్ట్స్ పొందండి..

**నేడు ఇంటర్మీడియట్ ఫలితాలు**
**8096958096కు మెసేజ్ పెట్టిన క్షణాల్లోనే వాట్సాప్‌లో రిజల్ట్స్**
**డిజిటల్ సేవల విప్లవం.. విస్తరణలో మరో ముందడుగు**
**మీసేవా వాట్సాప్ ప్లాట్‌ఫామ్ వేగంగా ప్రజాదరణ**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్11 (నినాదం) :** తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల విస్తరణలో మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో, ప్రజలకు సులభంగా ప్రభుత్వ సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన మీసేవా వాట్సాప్ ప్లాట్‌ఫామ్ వేగంగా ప్రజాదరణ పొందుతోంది. 2025 నవంబర్ 18న ప్రారంభమైన ఈ సేవ ప్రస్తుతం 580కు పైగా సేవలను అందిస్తూ రాష్ట్రంలో ప్రముఖ డిజిటల్ వేదికగా నిలిచింది. ప్రజలు రోజువారీగా వినియోగించే వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. ఇప్పుడు ఈ సేవల్లో భాగంగా తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ముఖ్యమైన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. 2026 ఏప్రిల్ 12 నుండి ఇంటర్మీడియట్ బోర్డు పరీక్ష ఫలితాలను విద్యార్థులు నేరుగా వాట్సాప్ ద్వారా పొందగలుగుతున్నారు. దీని ద్వారా వెబ్‌సైట్‌లో లాగిన్ కావడం లేదా మీ సేవ కేంద్రాలను సందర్శించడం అవసరం లేకుండా, ఫలితాలను క్షణాల్లోనే పొందే అవకాశం కల్పించబడింది. ఫలితాలను పొందడానికి విద్యార్థులు 8096 958096 నంబర్‌ను "మీసేవ తెలంగాణ"గా సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో "హాయ" మెసేజ్ పంపాలి. అనంతరం "బిఐఈ ఎక్జామ్ రిజల్ట్స్" సేవను ఎంపిక చేసి, రోల్ నంబర్, సంవత్సరం, స్ట్రీమ్ వివరాలను నమోదు చేస్తే ఫలితాలు వెంటనే అందుతాయి. ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ మరియు ఎస్సెస్సీ హాల్ టికెట్లను ఉచితంగా అందించిన ఈ ప్లాట్‌ఫామ్, విద్యార్థులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తోంది. ప్రజలు ఎక్కువగా ఉపయోగించే డిజిటల్ వేదికల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రతి ఇంటికి చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మీసేవా వాట్సాప్ సేవలు తెలంగాణను డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో నిలిపే కీలక అడుగుగా నిలిచింది.

# జెండా మోసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి**



**జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 11 (నినాదం) :** జెండా మోసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకా రం, అభినందన సభ జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి మంత్రి హాజర య్యారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తలకు అవకాశాలు వస్తాయని తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు కొత్తగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడవాళ్ళ జ్యోతి గ్రంధాలయ చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్, జగి త్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జువ్వాడి నరసింహారావు పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# సీఎం సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం..

**బ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన కొలను హనుమంత రెడ్డి**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ( సి ఎం ఆర్ ఎఫ్ ) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శనివారం బాచుపల్లి



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో లబ్ధి పొందిన వారిలో చింతల్ వాసులు, వేముల లక్ష్మమ్మ కు 60వేలు, రంగా నగర్ కాలనీ గాయం సుస్మిత రెడ్డి కి రూ. 60వేలు, చింతల్ వాసులు నాగరాజు కు రూ. 60వేలు, కూకట్ పల్లి వాసులు గోంగుల రాజు కు రూ. 56,500/-లు, బాచుపల్లి వాసులు కొర్ర సునీత రాణి కి రూ. 47,500/-లు కొలను హనుమంత రెడ్డి చేతుల మీదుగా సి.ఎం.ఆర్.ఎఫ్ మంజూరు పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు,. కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధికి శుభాకాంక్షల వెల్లువ

**కాంగ్రెస్ పార్టీలో యువతకు అరుదైన గౌరవం**
**మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్**



**జవహర్ నగర్, ఏప్రిల్ 11 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ యువ నాయకునికి అరుదైన పదవి దక్కడం అభినందనీయమని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఇటీవలే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, తదితరులు శనివారం శ్రీకాంత్ యాదవ్ ను గజమాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేయడం అభినందనీయమని ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణ ప్రభుత్వం జెట్ స్పీడ్ తో ముందుకెళ్లడం ముదా బావమన్నారు. అధికార పార్టీ ప్రతినిధిగా నియమితులైన శ్రీకాంత్ యాదవ్ స్థానికుడు కావడం ఆనందదాయకమన్నారు. అభివృద్ధిలో జవహర్ నగర్ ముందు వరసలో నిలబడడానికి శ్రీకాంత్ యాదవ్ సాయి శక్తుల కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా ముదిరాజ్ , నాయకులు కోటేష్ గౌడ్, జిల్లా మహిళా కన్వీనర్ గండి సునీత, మహిళా నాయకులు రేసు లక్ష్మి, సరిత, అనిల్ ముది రాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, రాజు యాదవ్, సాయి కృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు చిక్కిన డేకాయిటీ గ్యాంగ్

**ఆరుగురు అరెస్ట్**






**కీసర, ఏప్రిల్ 11, (నినాదం) :** మేడ్చల్ జిల్లా.. మల్కాజ్గిరి కమిష నరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్లో డిసిపి శ్రీధర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నాలుగు రోజుల క్రితం బాది తుడుపై దాడి చేసి 15 గ్రాముల గోల్డ్ , షిఫ్ట్ కార్ , ఆరు సెల్ఫోన్లో, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నాలుగు రోజుల్లో కేసులు చేదించారు. ఏడుగురు నింది తుల్లో ఒకరు తప్పించుకోగా ఆరుగురుని అదుపులోకి తీసు కొని రిమాండ్ కు తరలించారు. గతంలో అబ్దుల్లాపూ ర్మెట్ ఘట్కేసర్ , కీసరలో పలు దొంగతనాలు చేసినట్టు తెలిపారు. నిందితులు 1. కుసుమ కార్తీక్, 2 రామ్ రాజా , 3. బబ్లు సింగ్, 4. కందుల సాయి తేజ,5. గండ్ల శ్రావణ్, 6. మాచర్ల పవన్ కళ్యాణ్, 7 చెన్నకేశవుల పవన్ కళ్యాణ్ పరారీ పరారీలో ఉన్నాడు. అందరూ వరంగల్ ప్రాంతానికి చెందినవార. గ్రైండర్ యాప్ యాప్ గే అప్ ద్వారా పరిచయం చేసుకొని గేలను టార్గెట్ చేస్తూ వారిని దోచుకుంటున్నారు. వారిని వీడియోలు ఫోటోలు తీస్తూ బ్లాక్మెయిల్ చేస్తూ వారి వద్ద ఉన్న సొత్తును బ్లాక్మెయిల్ కు పాల్పడుతున్నారు. సోషల్ మీడియా ప్రైవేట్ యాప్ మోజులో పడద్దని యువత అప్రమత్తంగా ఉండాలని డిసిపి సిహెచ్ శ్రీధర్ సూచించారు.



## అగ్నికి ఆహుతైన ఎస్.వి.ఎన్ ఈవెంట్స్ గోదాం
# స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్ బహదూర్ పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నికి ఆహుతైన ఎస్ వి ఎన్ ఈవెంట్స్ కార్యాలయ సంఘటనాస్థలిని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్విఎన్ ఈవెంట్స్ ప్రొప్రైటర్, బాధితుడు వెంకటేష్ ఎమ్మెల్యే కు ప్రమాదతీరును వివరించి కన్నీటి పర్యాంత మయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రమాదాలు తరచూ జరుగుతున్నా యని ఎస్విఎన్ ఈవెంట్స్ గోదాం కాలిన సంఘటనలో ప్రొప్రైటర్ వెంకటేష్ కు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, ప్యాక్స్ చైర్మన్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ గ్రంధాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు పోలే శ్రీనివాస్, పుప్పాల భాస్కర్,మాజీ సర్పంచ్ కొమురయ్య యాదవ్, అలుగారి సత్య నారాయణ, సగ్గిడి శ్రీనివాస్ రావ్, సీనియర్ నాయకులు వారాల వినోద్, గుబ్బల లక్ష్మీ నారాయణ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అమర్నాథ్, ధనుంజయ్, దామోదర్, రఘుపతి రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ పౌర సమస్యలపై అధికారులతో
# ఎఫ్ఏసిఆర్ డబ్ల్యుఏ, బృందం భేటీ

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 11 (నినాదం):** మణికొండ పౌర సమస్యలపై అధికారులతో ఎఫ్ ఏ సి ఆర్ డబ్ల్యుఏ అధ్యక్షులు అర్వపల్లి వంశీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం జోనల్ కమిషనర్ హేమంత్ , డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, డీఈ శివ సాయిలను కలిసి పలు కీలక సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ పరిధిలో శనివారం మెగా సానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మణికొండ లో అధికారులను కలిసి పలు విషయాలను వారికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ రోడ్ల వెంట పాన్ షాపులు, గ్యాస్ స్టౌలు, టేబుళ్లు వేసి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న వాళ్లను నియంత్రించాలని కోరారు. వీధి వ్యాపారుల కోసం త్వరితగతిన ఇంటగ్రేటెడ్ సూపర్ మార్కెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు, ప్యాచ్ వర్క్‌లను తక్షణమే పూర్తి చేయాలని . 9 స్టార్ నమామి రోడ్ నం. 5 వెనుక భాగంలో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని , హైడ్రా సహకారంతో తిరుమల హిల్స్ సేఫ్ట్ పార్కులో అభివృద్ధి పనులు పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌ల లెవలింగ్, జిమ్ పరికరాల నిర్వహణ, వీధి కుక్కల నియంత్రణ, అదనపు పబ్లిక్ టాయిలెట్ల



ఏర్పాటు వంటి అంశాలపై అధికారుల దృష్టికి పెట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ స్పందిస్తూ.. కాలనీల ప్రతినిధులు లేవనెత్తిన అన్ని సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని, పౌర సదుపాయాల కల్పన లో మున్సిపల్ యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఎఫ్ ఏ సి ఆర్ డబ్ల్యు ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్ దేవ్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి. అవినాష్, దెండి శ్రీని వాస్ రెడ్డి, ఏ టి ఆర్ డబ్ల్యు ఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రదీప్ కుమార్ రెడ్డి, శర్మ, మహేంద్ర చారి కాలనీల నివాసితులు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు ఫిజికల్ వెరిఫికేషన్ తప్పనిసరి**
**సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**సుల్తానాబాద్, ఏప్రిల్11 (నినాదం):** హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని క చ్చితత్వంతో, సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆ దేశించారు.శనివారం ఆయన సుల్తానాబాద్ పుర పాలక సంఘంలోజరుగుతున్న జనగణన ప్రక్రియ ను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ,హౌ స్ లిస్టింగ్ బ్లాక్‌లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికే షన్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించా రు. పట్టణంలోని ల్యాండ్‌మార్క్‌లు, పాఠశాలలు, దేవాలయాలు, కార్యాలయాలు తదితర గుర్తుల ను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్‌కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదే శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్స న్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మేనేజర్ హలీమ్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు,ఊట్ల వరప్రసాద్, వేగోళం పద్మ అబ్బ య్య గౌడ్, కందునూరి సమత కుమార్, చింతల రాజు తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సంఘ సంస్కర్త జ్యోతి బాపూలె సేవలు చిరస్మరణీయం






**వికారాబాద్, ఏప్రిల్ 11(నినాదం) :** సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలె ఆశయాలను సాధించి సమసమాజ స్థాపన చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జ్యోతి బా పూలె 199వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళ్ళు అర్పించారు. మూడాచారాలతో మగుతున్న సమాజాన్ని వెన్ను తట్టిమేలుకోల్పిన మహనీయులని కొనియాడారు. మహిళలకు చదువుకోవడం మహాపాపమని భావించనా మూర్ఖులను ఎదురించి భార్యకు చదువు నేర్పించి సాటి మహిళలకు చదువు నేర్పించిన మహానుభావుడని అన్నారు. నేడు సమాజంలో పురుషులను ఆదిగమించి మహిళలు అన్నిరంగాల్లో రానిస్తున్నారంటే నాడు పూలె దంపతులు అవమానాలను భరించి అంధించిన చదువు ఒక్కటే కారణమని అన్నారు. సామాజిక స్పృహ ను నూరిపోసి సమసమాజస్థాపనకు కృషి చేసిన కృషివలడని అన్నారు. నాడు నేడు ఎందరికో ఆదర్శనీయులైన పూలె జీవితగాథ తెలుసుకుని ఆయన చూపిన మార్గన్ని అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మహాత్మా జ్యోతిబా పూలె 200వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలె చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం కోసం, ముఖ్యంగా బాలికల విద్య కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, బిసి వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. వికమహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు శనివారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పూలమాల వేసి నివాళులర్పించారు. అన సమాజంలో సమానత్వం కోసం, ముఖ్యంగా బాలికల విద్య కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, బిసి వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, అధికారులు, ఆయా పట్టణలలో మండల కేంద్రాల్లో, గ్రామస్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపనయన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్

**మల్కాజిగిరి, ఏప్రిల్ 11(నినాదం) :** మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్ బాగ్ లో ఉన్న శ్రీ లలిత పరమేశ్వరి దేవస్థానంలో శనివారం నిర్వహించిన ఉపనయన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ సరిపెల్లి సీతాపతి రావు, శేషమ్మ గార్ల మనుమడు వెంకట పవన్ సిద్ధార్థ ఉపనయన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, వేదపండితుల ఆశీర్వచనాల మధ్య బాలుడికి ఆశీస్సులు



అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందిస్తూ, బాలుడు విద్యా, సాంస్కృతిక విలువల్లో ఎదిగి మంచి భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి శ్రీనివాస్, వెంకటలక్ష్మి, ప్రసన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, పేపర్ శీను, జనార్ధన్, బాలకృష్ణ, ఉమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

6

# ఎండ దెబ్బకు అల్లాడిపోతున్నారా..?

### రోజూ ఈ జొన్న గంజి తాగితే మీ శరీరం ఏసీలా మారుతుంది



కావలసిన పదార్థాలు: అర కప్పు జొన్న రవ్వ లేదా జొన్న పిండి, మూడు కప్పుల నీరు , ఒక కప్పు మజ్జిగ, రుచికి తగినంత ఉప్పు , రెండు ఉల్లిపాయలు ఉల్లిపాయ, నాలుగు పచ్చిమిర్చి , కొత్తిమీరను తీసుకోవాలి.

జొన్న గంజి తయారీ విధానం: ముందుగా జొన్న పిండిని తీసుకుని ఒకసారి కడిగి పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక పాత్రలో నీటిని బాగా మరిగించి, దానిలో జొన్న రవ్వను వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి.

మీడియం మంటపై పెట్టి ఉండలు లేకుండా వాటిని బాగా కలుపుతూ ఉడికించండి. ఆ తర్వాత గంజి ఉండలుగా కాకుండా దానిని పలుచగా ఉండేలా చూసుకోవాలి.

చివర్లో ఉప్పును వేసి బాగా దానిని బాగా కలపండి. గ్యాస్ ఆఫ్ చేసి దానిని కిందకు దించి చల్లారనివ్వండి. బాగా చల్లారిన తర్వాత దానిలో గంజి కలిపి, ఇంకా ఉల్లిపాయ ముక్కలు, కట్ చేసిన పచ్చిమిర్చి, కొత్తిమీరను వేసి కలుపుకోవాలి

అంతే, వేడి వేడి జొన్న గంజి రెడీ. దీనిని సమ్మర్లో తాగితే బాడీలో ఉన్న వేడి మొత్తం కొట్టేస్తుంది. కాబట్టి, మీరు అస్సలు ఆలస్యం చేయకుండా దీనిని మీ ఇంట్లో చేసుకుని తాగండి

# పనస పండు వీరికి యమడేంజర్..

### తింటే ఏం జరుగుతుందో తెలిస్తే మైండ్ బ్లాంకే..

**వేసవి వచ్చిందంటే మామిడి పండ్లతో పాటు మార్కెట్లో నోరూరించే మరో పండు పనస. ఆ సువాసన వింటేనే చాలు, తినని వారు కూడా ఒక్క ముక్కైనా రుచి చూడాలనుకుంటారు. రుచిలో తీయగా, గుజ్జు ఎంతో మృదువుగా ఉండే పనస పండులో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇది అందరికీ మేలు చేయదని, కొందరికి ఈ పండు విషంతో సమానమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ పనస పండును ఎవరు తినాలి..? ఎవరు దూరంగా ఉండాలి..? అనే విషయాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం.**

**పోషకాల గని.. ఆరోగ్యానికి సిరి**

పనస పండులో నీటి శాతం, పీచు పదార్థం అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీనిలోని విటమిన్లు, ఖనిజాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇందులోని విటమిన్-సి ఇమ్యూనిటీని పెంచి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది.

పనస పండు పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని, అంగస్తంభన సమస్యలను తగ్గిస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు రాకుండా కాపాడుతాయి, జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడతాయి. రక్తహీనత సమస్యతో బాధపడేవారికి పనస ఒక మంచి ఔషధంలా పనిచేస్తుంది.

**ఎవరు తినకూడదు..?**

రుచిగా ఉంది కదా అని అతిగా తింటే కొన్ని ఆరోగ్య సమస్యలు తప్పవని రీసెర్చ్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ టెక్నాలజీ వెల్లడించింది.

**మధుమేహ బాధితులు:**
పనస పండులో సహజ చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. అందుకే షుగర్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి.






**జీర్ణ సమస్యలు ఉన్నవారు:**
పనస పండు తిన్న తర్వాత కొందరిలో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు దీనిని పరిమితంగా తీసుకోవాలి.

**గర్భిణీలు:**
గర్భధారణ సమయంలో షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉన్నందున గర్భిణీలు పనస పండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకే తీసుకోవడం ఉత్తమం.

**రక్తం గడ్డకట్టే సమస్యలు:**
బ్లడ్ కోగ్యులేషన్ సమస్య ఉన్నవారు పనస పండు తినకూడదు, ఇది ఆ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే అవకాశం ఉంది.



పనస పండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, అది ఒక ఔషధం కూడా. అయితే ఏదైనా అతిగా తింటే నష్టమే. ఆరోగ్యంగా ఉన్నవారు కూడా మితంగా తీసుకుంటేనే పనస ప్రయోజనాలను పూర్తిగా పొందగలరు. మీకు ఏవైనా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే నిపుణులను సంప్రదించిన తర్వాతే ఈ పండును మీ డైట్లో చేర్చుకోండి.

# ఇది మామూలూ ఆకుకూర కాదు..

### ఏడాది పొడవునా ఫ్రెష్‌గా ఉంటుంది.. ఎలాగంటే?

ఆకు కూరలు గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. వీటిని వారంలో మూడు సార్లు తింటే, ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది పాలకూర, తోట కూర తింటారు.

అయితే, వాటితో పాటు మెంతి కూర హెల్త్‌కి మంచిది.

మెంతికూరలో ఐరన్, ఫైబర్ తో పాటు పోషకాలు కూడా ఉన్నాయి. అందుకే, ఈ మెంతి కూరను ఎక్కువగా పరాఠాల్లో తింటారు. అయితే, ఫ్రెష్ మెంతికూర త్వరగా పాడవుతుంది. దీనిని నిల్వ చేసే పద్ధతుల గురించి ఇక్కడ తెలుసుకుందాం..

మెంతి కూరలను తాజాగా ఉంచేందుకు రిఫ్రిజిరేటర్ బెటర్. ముందుగా మెంతి ఆకులను తీసుకుని కడగకుండా ఒక క్లాత్ లో కానీ, టిష్యూలో కానీ పెట్టి చుట్టాలి. ఆ తర్వాత గాలి చొరబడని పాలిథిన్ బ్యాగ్‌లో నిల్వ చేయాలి.

మెంతికూరను ఏడాది పాటు నిల్వ చేయొచ్చు. ఎలా అంటే దానిని ఎండలో బాగా ఎండబెట్టి నిల్వ చేయవచ్చు. దీని కోసం మెంతి ఆకులను తీసుకుని మంచి నీటితో బాగా కడిగి ఆరబెట్టుకోవాలి. వాటిని ఒక క్లాత్ పై పరిచి ఆకులు ఆరిపోయే వరకు ఉంచాలి.

ఈ మెంతి ఆకులు పూర్తిగా ఆరిపోయిన తర్వాత మీ చేతులతో తీసుకుని వాటిని పొడి చేసి ఒక చిన్న జాడిలో నిల్వ చేయాలి. ఈ ఎండిన మెంతికూర ఏడాది పొడవునా నిల్వ ఉంటుంది. పప్పు , చట్నీలు చేసుకోవడానికి



ఉపయోగపడుతుంది.

# బంగాళాదుంప మజ్జిగ పులుసు రెసిపీ..

### వేడి అన్నంలోకి సూపర్ కాంబినేషన్!

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు పెరుగు, పావుకిలో బంగాళా దుంపలు , 1 టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ టీస్పూన్ జీలకర్ర, 4 పచ్చిమిర్చి , అరటేబుల్ స్పూన్ పసుపు, పావు టీ స్పూన్ ఇంగువ, కరివేపాకు ఆకులు వేసుకోవాలి.

బంగాళా దుంప మజ్జిగ పులుసు తీసుకుని కడిగి క్లీన్ చేసి వాటిని ముక్కలుగా కట్ చేసుకుని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. పాత కాలంలో ఈ కూరను ఎంతో ఇష్టంగా తిన్నారు. మీరు దీనిని ఒకసారి వండితే మీ ఫేవరేట్ అవ్వడం పక్కా.

ఇప్పుడు రెండు కప్పులు పెరుగును తీసుకుని, దానిలో మూడు గ్లాస్ లు నీళ్ళు పోసి మజ్జిగలాగా చేసుకోవాలి. ఇప్పుడు దీనిలో మసాలా పేస్ట్, అర టేబుల్ స్పూన్ పసుపు, రుచికి తగినంత ఉప్పును వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి

ఈ మజ్జిగను తీసుకుని దానిలో బంగాళా దుంపలు వేసి మీడియం మంటపై తక్కువగా పెట్టి 15 నిముషాల పాటు బాగా వేయించుకోవాలి. బంగాళా దుంపలకు మజ్జిగ రసం పట్టే అలాగా ఉడికించుకోవాలి.

ూా చివర్లో మళ్ళీ పాన్ తీసుకుని దానిలో కొద్దిగా ఆవాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, రెండు ఎండుమిర్చి , నాలుగు కరివేపాకు ఆకులు వేసి వాటిని బాగా వేయించుకోవాలి. ఈ బంగాళా మజ్జిగ



పులుసును వేడి అన్నంలో తింటే రుచి అదిరిపోతోంది.

# ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం

### నేడు విశ్వేశ్వరయ్య వర్ధంతి

నేడు మన దేశం సుభిక్షంగా పంట, పొలాలతో... వరద ముంపులేని ప్రాంతాలతో తులతూగడానికి కారణం ఓ మహామనిషి కృషి. ఊళ్లకు ఊళ్లనే తన గర్భంలో కలిపేసుకునే ఉగ్ర గంగను ఆపిన మహా శక్తివంతు డాయన. ఏడుకొండల వాడా... ఎక్కడున్నావయ్యా.. అంటూ అలసిసొలసిన భక్తునికి వేంకటేశుని పాదాల చెంతకు వెళ్లే అతి తేలికైన దారిని చూపించిన మహామేధావి. ఆయనే సుప్రసిద్ధ ఇంజనీర్, పండితుడు, ప్రముఖ అధికారి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య. మూడు దశాబ్దాల క్రితం మోక్షగుండం నుంచి ఆయన కుటుంబీకులు మైసూరుకు వలస పోయినా, వారి జన్మస్థలి నామధేయ మైన మోక్షగుండం మాత్రం వారి వెన్నంటే వెళ్లి, మోక్షగుండం వారి ఇంటిపేరు అయింది. మోక్షగుండం గౌరవార్థం, ఆయన పుట్టిన రోజుని ఇంజనీర్ల దినోత్సవముగా జరుపుతారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య (సెప్టెంబర్ 15, 1861- ఏప్రిల్ 12, 1962), గొప్ప ఇంజనీరు, పండితుడు, రాజనీతి జ్ఞుడు. 1912 నుండి 1919 వరకు మైసూర్ దివాన్ గా పనిచేశారు. 1955లో ఆయనకు భారతదేశపు అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" లభించింది. ప్రజలకు చేసిన సేవలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం తరపున "ఐదవ కింగ్ జార్జి నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్" బిరుదునిచ్చి సత్కరించాడు. విశ్వేశ్వరయ్య 1861, సెప్టెంబరు 15న బెంగుళూరు నగరానికి 60 మైళ్ళ దూరంలోగల చిక్క బళ్ళాపూర్ తాలూకా, ముద్దేనహళ్ళి అనే గ్రామంలో జన్మించాడు. అతను తల్లిదండ్రులు మోక్షగుండం శ్రీనివాస శాస్త్రి, వెంకట లక్ష్మమ్మ. వీరి పూర్వీకులు ఆంధ్ర ప్రదేశ్, ప్రకాశం జిల్లా లోని మోక్షగుండం గ్రామానికి చెందిన వారు. మూడు శతాబ్దాల కిందట వారు మైసూరు రాష్ట్రానికి వలస వెళ్ళినా తెలుగు మాట్లాడ గలిగే వారు. ఆయన తండ్రి సంస్కృత పండితుడు, హిందూ ధర్మశాస్త్ర పారంగతుడే కాక ఆయుర్వేద వైద్యుడు కూడా. 12 ఏళ్ల ప్రాయంలో తండ్రిని పోగొట్టుకుని, విశ్వేశ్వరయ్య, తన ప్రాథమిక విద్యను బెంగళూరులోని చిక్కబల్లాపూర్‌లో పూర్తి చేశారు. 1881 సంవత్సరంలో మద్రాసు యూనివర్శిటీ నుంచి బీఏ పట్టా పొందారు. పూనేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. తరువాత తన 23వ యేట బొంబాయి ప్రజా పనుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా చేరగా, అనంతరం భారత నీటి పారుదల కమిషను చేర వలసినదిగా ఆహ్వానం వచ్చింది. 1906-1907 మధ్య కాలంలో ఆయనను భారత ప్రభుత్వం యెమెన్ లోని ఆడెన్ కి పంపించి అక్కడి నీటి పారుదల వ్యవస్థనూ, మురికి కాలువల వ్యవస్థను రూపకల్పన చేయమని కోరగా, నిర్దేశించిన పథకం ప్రకారం అక్కడ మంచి ప్రాజెక్టు విజయ వంతంగా పూర్తి చేశారాయన. మైసూర్ చాంబర్ ఆఫ్ కామర్స్, 1917లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజి, మైసూరు విశ్వవిద్యాలయం నెలకొల్పటంలో, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులో, హైదరాబాదులోని పత్తర్‌గట్టి నిర్మాణానికి డిజైన్లో ప్రధాన పాత్ర ఉంది. దేశంలోనే తొలిసారిగా 1903లో ఆటోమేటిక్ ఫ్లడ్ గేట్ల పద్ధతిని కనుగొన్నారు. ఈ సూత్రం విజయవంతం కావడంతో దేశంలో పలుచోట్ల ఇదే తరహా పద్ధతిని ప్రవేశ పెట్టారు. రిజర్వాయిర్‌లో భారీగా చేరే నీటిని నిలువ వుంచగలిగే సదుపాయంతో పాటు డ్యామ్‌కు ఎటువంటి హాని తల పెట్టకుండా చూడటంలో ఈ ఫ్లడ్ గేట్లు ఎంతగానో ఉపయోగ పడ్డాయి. 1908లో మూసి నదికి వరద రావడంతో హైదరాబాద్ నగరం ప్రమాదంలో చిక్కు కోగా హైదరాబాద్ ను వరద ముప్పు నుంచి రక్షించేందుకు అప్పటి నిజాం నవాబు, విశ్వేశ్వర్యను ఆహ్వానించి పరిష్కారం వెతకాలని కోరటంతో పటిష్టమైన నగర మురుగునీటి పారుదల పథకాన్ని రూపొందించారు. ఆ మూసీపై రిజర్వాయర్ నిర్మాణంలో హైదరాబాద్ నగరానికి వరద ప్రమాదం తప్పింది. విశాఖ పట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడం లోనూ విశ్వేశ్వరయ్య



పాత్ర ఉంది. ఆయన సలహా మేరకే గండిపేట్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారు. మూసీ నుంచి తరలివచ్చే వరదకు అక్కడే అడ్డుకట్ట పడింది. ఈ జలాశయాల్లో నిల్వచేసిన నీళ్లే హైదరాబాదీల దాహార్తిని తీరుస్తున్నాయి. భారత దేశంలోనే అతిపెద్దదైన కృష్ణా నదిపై నిర్మించిన "కృష్ణరాజ సాగర్" నిర్మాణ సమయంలో ఛీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. దేశంలో చాలా డ్యామ్‌లు నిర్మించారు. ఆయన స్వస్థలంలో విశ్వేశ్వరయ్య మెమోరియల్ ట్రస్టు వారు ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఇందులో అతను సాధించిన పతకాలు, బిరుదులు, అతను వాడిన కళ్ళద్దాలు, కప్పులు, వెబ్ స్టర్ డిక్షనరీ, అతను విజిటింగు కార్డును ముద్రించే పరికరం లాంటి వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జాతి గర్వించే ఎన్నో సాంకేతిక కట్టడాలు అందించిన సర్ విశ్వేశ్వ రయ్య ప్రతి ఇంజనీర్‌కు స్ఫూర్తిదాత. ఆ స్ఫూర్తి తోనే శాస్త్ర సాంకేతిక, నిర్మాణ, రవాణా రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోంది. ఏడాదికి లక్షల మంది ఇంజనీర్లు తయారవు తున్నారు. నాణ్యతకు రాజకీయం, అవినీతి అడ్డుగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ రంగ పితామహాలు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్‌ల వలే ప్రజల మదిలో చిరకాలం నిలిచి పోయేందుకు ప్రతీ ఇంజనీర్ కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామకిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**




## పెరిగిన బంగారం, వెండి ధరలు..
# ఈ రోజు ఎలా ఉన్నాయంటే..



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడిదారులు బంగారం, వెండి కొనుగోళ్లపై ఆసక్తి చూపిస్తున్నారు. కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు ప్రస్తుతం మళ్లీ పుంజుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కూడా బంగారం ధరలు పెరుగుదల నమోదు చేశాయి.

ఈ రోజు (ఏప్రిల్ 11న) ఉదయం 6:00 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,52,360 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,39,660 దగ్గర ఉంది (శ్రీఅజవ ప్రశీశ్రీస తీఫ్వం). ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,52,510కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,39,810కి చేరుకుంది.

మరోవైపు వెండి ధర కూడా పెరుగుదల నమోదు చేసింది. ప్రస్తుతం 2.65 లక్షల రూపాయల చేరువలో కదలాడుతోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు పలు నగరాల్లో బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం..

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 1,52,360, రూ. 1,39,660

విజయవాడలో రూ. 1,52,360, రూ. 1,39,660

## ఛార్జీలు విధిస్తే యూపీఐ వాడమంటున్న యూజర్లు



ప్రస్తుతం దేశంలో యూపీఐ అందరికి అవసరమైన కీలక డిజిటల్ సాధనంగా ఉంది. అయితే, గత కొంతకాలంగా యూపీఐ వినియోగంపై ఛార్జీలు విధిస్తారనే ఊహాగానాలు పెరిగాయి. అలాంటిదేమీ ఉండదని ఆర్‌బీఐ స్పష్టం చేసినప్పటికీ, కథనాలు కొనసాగుతూనే ఉన్నాయి. యూపీఐ వ్యవస్థ ప్రారంభమై ఆగష్టుతో 10 ఏళ్లు పూర్తవనుంది. ఈ సందర్భంగా దీని గురించి తాజాగా ప్రముఖ లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో యూజర్లు పలు కీలక అంశాలను వెల్లడించారు. లావాదేవీలపై ఛార్జీలు ప్రవేశపెడితే యూపీఐ వాడటాన్నే మానేస్తామని దాదాపు నలుగురిలో ముగ్గురు యూజర్లు చెప్పారు. యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండకూడదని 75 శాతం మంది స్పష్టం చేశారు. కేవలమ 25 శాతం మంది మాత్రమే అవసరానికి ఉపయోగిస్తామన్నారు. వీరిలో కూడా స్థిరమైన ఛార్జీలు ఉండాలని, ఇష్టమొచ్చిన విధంగా ఉండకూడదని ఎక్కువమంది చెప్పారు. 2025-26 నాటికి యూపీఐ ద్వారా రూ. 314 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. సంఖ్యా పరంగా ఇది 2,400 కోట్లకు పైనే యూపీఐ ప్లాట్‌ఫామ్ ప్రాసెస్ చేసింది. ఉచిత, సులభమైన లావాదేవీల వల్లే యూపీఐ వేగంగా విస్తరించింది. కానీ, ఛార్జీలు ప్రవేశపెడితే యూజర్ల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని సర్వే పేర్కొంది.

# ఆధునిక సమాజ అక్షర యోధుడు ఫూలే..

### అంబేద్కర్‌నగర్లో వైభవంగా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ మహోత్సవం.

### పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్.. దళిత బహుజన తత్వవేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య



జవహర్ నగర్ ఏప్రిల్ 11 (నినాదం): అణగారిన వర్గాలకు అక్షర యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే నేనని ఉత్పత్తి కులాల్లో విద్యతోనే వివేకం ఉద్భవిస్తుందని ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఐక్యరాజ్యసమితిని శాసించే స్థాయికి తీసుకపోతుందని మహిళలు చదువుకుంటేనే భవిష్యత్ తరాలకు దిక్సూచి అవుతుందని ప్రతి ఒక్కరి జీవితంలో విద్య వివేకవంతులను చేస్తుందని ప్రపంచ మేధావి ప్రొఫెసర్ కంచ ఐలయ్య పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని అంబేద్కర్ నగర్లో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ తదితరుల ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య హాజరై మాట్లాడుతూ చదువుకు పూలేను దూరం చేయాలని కొన్ని శక్తులు అడ్డు తిరిగినా వెనకడుగు వేయకుండా మొక్కవోని దీక్షతో చదివి దేశంలోనే ఆదర్శవంతుడయ్యాడని సాంఘిక దురాచారాలు మూఢనమ్మకాలు విద్యతోనే అంతమవుతాయి అన్నారు. భారతదేశ సామాజిక ప్రజాస్వామ్యానికి మూలపురుషుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని భారత దేశ చరిత్రను ఎక్కువగా రాజ్యాలు యుద్ధాలు, పాలకుల విజయాలతో గుర్తుపెట్టుకుంటాం కానీ కోట్లాది ప్రజల జీవితాలను నిజంగా మార్చిన ఆలోచన చరిత్ర మాత్రం తరచూ అంచులకు నెట్టి వేయబడుతుందని ఆ అంచుల్లో నుండి నిలబడి భారత సమాజపు మూలాలను కదిలించిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన ఒక సంఘసంస్కర్త మాత్రమే కాదు భారతదేశాన్ని తిరిగి నిర్మించాలని ధైర్యం ఉన్న ధీరోదాత్తుడని తొలి ఆధునిక తత్వవేత్త అన్నారు. కుల వివక్షతను రూపు మాపడమే కాకుండా సామ్రాజ్యవాద వ్యతిరేక కార్మిక రైతాంగ పోరాటాలకు ఊపిరిని తెచ్చాడని తెలిపారు.






సావిత్రిబాయికి తానే స్వయంగా చదువు చెప్పి దేశంలోనే మొట్టమొదటి పంతులమ్మ ను చేశాడంటే అతిశయోక్తి కాదని చట్టసభల్లో మహిళలు పురుషులతో సగభాగం అయ్యే అవకాశాలు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అనంతరం పూలే విగ్రహ దాత కాగిత రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఎమ్మెల్సీ సత్యం, నెల్లికంటి శరత్, నల్ల రాధాకృష్ణ, వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, జవహర్ నగర్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, శంకర్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పరుశురాం, కార్యదర్శి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, పలు రాజకీయ కుల సంఘాల సభ్యులు, మేధావులు, పాత్రికేయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లాభాలు తెచ్చే తేనెటీగల పెంపకం..

### తక్కువ పెట్టుబడితో అదిరిపోయే బిజినెస్ ఐడియా!

తక్కువ పెట్టుబడితో, తక్కువ శ్రమతో భారీ లాభాలను ఆర్జించాలని చూస్తున్నారా? అయితే 'తేనెటీగల పెంపకం' మీకు ఒక అద్భుతమైన అవకాశం. బీహార్‌లోని పశ్చిమ చంపారణ్ వంటి ప్రాంతాల్లో రైతులు ఈ వ్యాపారం ద్వారా నెలకు లక్షల రూపాయలు గడిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ లాభదాయకమైన వ్యాపారం గురించి పూర్తి వివరాలు మీకోసం.

తేనెటీగల పెంపకం ఎలా జరుగుతుంది?

తేనెటీగల పెంపకం అనేది ప్రకృతితో ముడిపడి ఉన్న వ్యాపారం. దీనికోసం ప్రత్యేకంగా ఆహారం పెట్టాల్సిన అవసరం ఉండదు. పండ్ల తోటలు, పూల మొక్కలు ఉన్న వాతావరణంలో తేనెటీగల పెట్టెలను (దీవవ దీశీఇవం) ఉంచితే సరిపోతుంది. తేనెటీగలు బయటకు వెళ్లి పూల నుండి మకరందాన్ని సేకరించి, తిరిగి పెట్టెల్లోని 'కోంబ్స్' (జశీఎఎం) లో తేనెను నింపుతాయి.

పెట్టుబడి వివరాలు:

వ్యాపార నిపుణుల లెక్కల ప్రకారం, వ్యాపారాన్ని కమర్షియల్ గా మొదలుపెట్టడానికి 50 పెట్టెలు సరిపోతాయి. ఒక్కో తేనెటీగల పెట్టె ధర సుమారు రూ. 4,000 ఉంటుంది. 50 పెట్టెలకు రూ. 2 లక్షలు అవుతుంది. ఇక ఖర్చు



విషయానికొస్తే.. సంవత్సరం పొడవునా పర్యవేక్షణ, వర్షాకాలంలో తేనెటీగలకు ఇచ్చే ఆహారం కోసం మరో రూ. 50,000 ఖర్చవుతుంది. మొత్తం పెట్టుబడి సుమారు రూ. 2.5 లక్షలు.

ఆదాయం ఎలా ఉంటుంది?

దిగుబడి: ఈ 50 పెట్టెల ద్వారా నెలకు సుమారు 100 నుండి 250 కిలోల వరకు తేనెను సేకరించవచ్చు. మార్కెట్‌లో నాణ్యమైన తేనె కిలో ధర రూ. 500 నుండి రూ. 1000 వరకు పలుకుతోంది.

వార్షిక సంపాదన: ఏడాదిలో 8 నెలల పాటు తేనె సేకరణ జరుగుతుంది. దీని ద్వారా సగటున 1200 కిలోల తేనెను పొందితే, కనీస ధర రూ. 500 చొప్పున వేసుకున్నా రూ. 6 లక్షల ఆదాయం వస్తుంది. అదే మంచి ధర దొరికితే రూ. 12 లక్షల వరకు సంపాదించవచ్చు.

సీజన్: అక్టోబర్ నుండి మే నెల వరకు తేనె ఉత్పత్తి అధికంగా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో (ఆవాల పంట సమయంలో) దిగుబడి రెట్టింపు అవుతుంది. ఇక జూన్ నుండి సెప్టెంబర్ వరకు వర్షాకాలం వల్ల తేనెటీగలు బయటకు వెళ్లలేవు. ఆ సమయంలో వాటిని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. తేనెటీగలకు సరైన వాతావరణం కల్పించడం, వ్యాధులు సోకకుండా చూసుకోవడం మాత్రమే మీరు చేయాల్సిన పని. ఈ వ్యాపారం చేయాలని అనుకుంటే మీరు సమీపంలోని వ్యవసాయాధికారులను సంప్రదించడం ద్వారా ఈ వ్యాపారంపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీల గురించి కూడా సమాచారం పొందవచ్చు.



# గణితశాస్త్రంలో అఫ్సర్ అహ్మద్‌కు పీహెచ్.డీ



**పటాన్చెరు, ఏప్రిల్ 11(నినాదం) :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి అఫ్సర్ అహ్మద్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'రెండు గిడ్డంగుల వ్యవస్థలో క్షీణించే వస్తువుల నిల్వల ఆప్టిమైజేషన్ అంశాలపై ఒక అధ్యయనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణాంక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, పర్యావరణ సుస్థిరతను పరిగణనలోకి తీసుకుంటూ, త్వరగా పాడైపోయే వస్తువుల నిల్వల నిర్వహణను ఆప్టిమైజ్ చేయ డానికి ఒక అధునాతన నమూనాను అందిస్తుందని తెలిపారు. ఈ అధ్యయనం, నిల్వ, రవాణా సామర్థ్యాన్ని పెంచడానికి రూపొందించిన రెండు గిడ్డంగుల వ్యవస్థపై దృష్టి పెడుతుందన్నారు. హరిత సాంకేతికతలను అవలంబించడం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంపై ఇది గట్టిగా ప్రయత్నించినట్టు పేర్కొన్నారు. ధరపై ఆధారపడిన డిమాండ్, పాక్షిక బ్యాక్ లాగింగ్, కాలంతో పాటు మారే నిల్వ ఖర్చులు వంటి కీలకమైన ఆచరణాత్మక అంశాలను పొందుపరుస్తూ, ఈ పరిశోధన ఆధునిక సరఫరా గొలుసు నిర్వహణ కోసం ఒక సమగ్రమైన, వాస్తవికమైన ఫ్రేమ్ వర్కును అందిస్తుందని వివరించారు. సుస్థిరత-ఆధారిత వ్యూహాలను కార్యాచరణ సామర్థ్యంతో అనుసంధానించడం ద్వారా, లాభదాయకతను పర్యావరణ బాధ్యతతో సమతుల్యం చేయాలనుకునే వ్యాపారాలకు ఈ నమూనా విలువైన అంతర్దృష్టులను అందిస్తుందన్నారు. డాక్టర్ అఫ్సర్ అహ్మద్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జవహర్‌నగర్‌లో పేదలకు ఉచిత వైద్య శిబిరం

### జనహిత, లయన్స్ క్లబ్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణ




**జవహర్‌నగర్, ఏప్రిల్11 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో పేదలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు జనహిత సేవా ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, బంజారా పెరల్స్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గరీబోళ్లకు ఉచితంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ గరీబోళ్లను ఆదుకుంటేనే, సమాజంలో తద్వారా దేశంలో మంచి గుర్తింపు లభిస్తుందని, పేదల కోసం జవహర్ నగర్ లో కంటిన్యూగా రాబోయే రోజుల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూనే ఉంటామని తెలిపారు. జవహర్ నగర్ లో పేద ప్రజలే ఎక్కువగా నివసిస్తున్నారని , మినీ భారత్ గా పేరు గాంచిన జవహర్ నగర్ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు నిలయమని ఎక్కువగా జవహర్ నగర్ లో పేదలు మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారని వారి ఆరోగ్య రక్షణ కోసం ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, ఆరోగ్య జవహర్ నగర్ లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. డంపింగ్ యార్డ్ కు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రజలు ఆరోగ్య రక్షణ పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి, జయమోహన్, సునీతారెడ్డి, శాంత కుమారి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుప్చర్ల సర్పంచ్‌ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కొడంగల్, ఏప్రిల్ 11(నినాదం) :** బొంరాస్ పేట్ మండలం లోని దుప్చర్ల గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పార్టీ నాయకుల తో కలిసి వెళ్లి ఆసుపత్రిలో పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితి ని తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంబడి బిఆర్ ఎస్ పార్టీ నాయకులు సల్లా మహేందర్ రెడ్డి,శేరినారాయణ రెడ్డి, రమణ రెడ్డి,నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## భారతజాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు
# జ్యోతిరావు పూలే : చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్‌బినగర్, ఏప్రిల్ 11(నినాదం) :** భారత జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని శ్రీ రామకృష్ణా పురం కాలనీ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే నేటికి కోట్ల మందికి స్ఫూర్తి ప్రదాత అందుకే ఆయన మాటలు, చేతలు నేటికీ మనలో ఆశా ఓవహ దృక్పథానికి కారణమవుతున్నాయి. అందుకే రెండు శతాద్ధాల క్రితం జన్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే గత జ్ఞాపకంగా కాక భావితవ్యానికి మార్గదర్శిగా మిగిలారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఛైర్మెన్ తలాటి రమేష్ నేత, మహేశ్వరం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, బొడ్డుపల్లి మహేందర్, సభావత్ రాజు నాయక్, మామిడి రామకృష్ణ గౌడ్, లింగ స్వామి గౌడ్, పగిళ్ళ భూపాల్ రెడ్డి, ప్రేమ్ నాయక్, విజయ్, పగడాల ఏల్లన్న, గుణుగంటి రమేష్ గౌడ్, శ్రీధర్, వెంకటరమణ రెడ్డి, జహంగీర్, రఘువర్ధన్ రెడ్డి, దుర్గా ప్రసాద్, మహమ్మద్, సాయి జగదీష్, జెల్లా జగన్నాథం, పాండు, సమ్మద్, విప్లవ్, శ్యామ్ సుందర్ రావు, నగేష్, సాయి కుమార్, మల్లేష్, పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొని
# ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనంపల్లి



**మల్కాజిగిరి, ఏప్రిల్ 11 (నినాదం) :** మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శివపురి కాలనీ మల్లికార్జున స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, లక్ష్మీ కాంత్ రెడ్డి, చంద్రశేఖర్, గుండా నిరంజన్, జి ఎన్ వి సతీష్ కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, పిట్టల నాగరాజు, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, బాబు, సత్యనారాయణ, సయ్యద్ మబ్బు, సురేష్ సింగ్, శ్రీరామ్ యాదవ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, సందీప్ గౌడ్, ఆశ, శారద, సిరిగిరి రాజు, రామచందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావ్ పూలే సేవలు చిరస్మరణీయం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ జీడిమెట్ల బస్ డిపో, సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్ లలో జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద ఆయన 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బి ఆర్ ఎస్ ఎల్ పి విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యా విస్తరణకై పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జ్యోతిరావు పూలే చూపిన మార్గంలో నేటి యువత పయనించి విద్యా, సమాన హక్కుల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోళ్ల రాజు గౌడ్, కార్యదర్శి ముద్దా మహేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్ ముదిరాజ్, సభ్యులు కృష్ణ, నాగరాజ్, నరసింహ, కవిత, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పోలే శ్రీకాంత్, దుండిగల్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, సీనియర్ నాయకులు వారాల వినోద్, గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, ప్రభాకర్, యూసుఫ్, ఏవి శేషాచారి, శ్రీనివాస్ రెడ్డి, తారా సింగ్, మంగ, చందు, కరాటే శ్రీను, కోల శ్రీకాంత్, వేణు ముదిరాజ్, కైసర్ బాషా, సాయిరాం రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.





## హనుమాన్ సర్వ జగత్ రక్షకుడు

హనుమాన్ మాలధారణకు నెలవు సిద్దిపేట
స్వాములు దీక్షా ఫలించి..
మీ సంకల్పాలు నెరవేరాలి
మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట ఏప్రిల్ 11(నినాదం):** హనుమాన్ మాలధారణ ప్రారంభం అయిన నేపథ్యంలో సిద్దిపేటలో రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయంలో శనివారం జరిగిన హనుమాన్ మాలధారణ స్వాముల భిక్షా కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆలయంలో ఆంజనేయ స్వామిని దర్శించుకొని వెండి ఆభరణాలు సమర్పించా రు హనుమాన్ సర్వ జగత్ రక్షకుడన్నారు. స్వాముల దీక్ష ఫలించి సంకల్పాలు నెరవేరాలని ఆకాంక్షంచారు.. హనుమాన్ స్వామి అనుగ్రహంతో అన్నింటా శుభం కలగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలధా రణ స్వాములతో కలసి భిక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు

## గొప్ప మహనీయుడు
## మహాత్మ జ్యోతిరావు పూలే



**మల్కాజిగిరి, ఏప్రిల్ 11(నినాదం) :** కుల వివక్ష అంటరానితనంపై పోరాడుతూ, అనగారిన వర్గాల మహిళలు, అనగారిన వర్గాల విద్య సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూలే చేసిన సేవలను కొనియాడారు. జ్యోతి రావు పూలే 119 వ జయంతి సందర్భంగా సైనిక్ పురి లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మి కాంత్ రెడ్డి, మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బికే శ్రీనివాస్, గుండా నిరంజన్, ఎస్ఆర్ ప్రసాద్, జి ఎన్ వి సతీష్ కుమార్, చిత్ర గోకుల్, ఇందిర ప్రియదర్శిని, కపిల్, వినోద్ యాదవ్, రామచందర్, సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్, పిట్టల నాగరాజు, యాది, కుట్టి శ్రీనివాస్, ప్రభా, ఆశా, సుధ, శారద, ఎన్ కృష్ణ, సిరిగిరి రాజు, రాందాస్ సంతోష్ ముదిరాజ్, చుంకూ శ్రీనివాన్, వెంకటేష్, మంద భాస్కర్, బాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో వైభవంగా
## 'హిందూ సమ్మేళన దినోత్సవం'



**రాజేంద్రనగర్ ఏప్రిల్11 (నినాదం):** ఖానాపూర్ గ్రామ గ్రామంలో వైభవంగా హిందూ సమ్మేళ దినోత్సవం. శనివారం హిందూ ధర్మ రక్షణ, ఐక్యతను చాటిచెప్పే ఉద్దేశంతో నిర్వహించిన హిందూ సమ్మేళన దినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలకు చెందిన హైందవ సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చి, హిందూ ఐక్యతను చాటారు. ఈ సమ్మేళనంలో గోల్కొండ బాగ్ సంపర్క ప్రముఖ్ ముఖ్య వక్త కొక్కిరాల నవీన్ కుమార్ పాల్గొని ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో హిందూ ధర్మం యొక్క ప్రాముఖ్యతను, యువత ధర్మ పరిరక్షణలో పోషించాల్సిన పాత్రను వివరించారు. హిందూ సమాజమంతా ఒక్కటిగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖులు రాజేశ్వరి బుద్ధిరాజు తమ సందేశాన్ని అందించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ఈ సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఇటువంటి సమ్మేళనాలు నిర్వహించడం వల్ల హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు పదిలంగా ఉంటాయని, పరస్పర సహకారం పెరుగుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున జై శ్రీరామ్ నినాదాలతో ఓరెత్తించారు.

# మహాత్మ జ్యోతిబాపూలేకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కాప్రా, ఏప్రిల్11 (నినాదం) :** మహాత్మ జ్యోతిబాపూలే 199 వ జయంతి సందర్భంగా సైనిక్ పూరి లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే దేశానికి ఎనలేని సేవలు అందించారని, చదివే మన ఆర్థిక మూలాలకు కారణమని, చదువుకుంటే సామాజిక ఆర్థిక విధానాలలో ప్రజలు మార్పు చెందుతారని, బాల్యవివాహాలను వితంతు వివాహాలను కుల నిర్మూలనను అరికట్టాలంటే, అందరమూ సంఘంలో కొన్ని సంస్కరణ చేయాలని దానికి అందరం కూడా నడుం బిగించాలని ముఖ్యంగా మహిళల అభ్యున్నతి చదువు వలన సాధ్యమని, సావిత్రిబాయి పూలే కు చదువులు నేర్పి మహిళలకు ఒక పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దనుండే ఎఫ్ఐఆర్ నమోదు

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్



**వికారాబాద్, ఏప్రిల్ 11(నినాదం):** ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు ఇంటి వద్దనుండే ఎఫ్ఐఆర్ నమోదు విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల నివాసానికి లేదంటే వారికి అనుకూలమైన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారని వివరించారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసులే బాధితుడి వాంగ్మూలాన్ని వారి భాషలో నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకొని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రతిని అందజేస్తారని అన్నారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది, ఆలస్యం తగ్గుతుంది, అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు.

## శివ శివాని విధ్యా సంస్థ ఆధ్వర్యంలో
# ఘనంగా ఎడ్యుకేషన్ కాంక్లేవ్

ప్రయోగాత్మక విద్యా విధానం ప్రవేశపెట్టాలి.
ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి తెలంగాణ
కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్






**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11 (నినాదం) :** శివ శివాని విద్యా సంస్థలో నేడు "విద్యా నాయకత్వ సాధికారత" అనే అంశంపై ప్రత్యేక ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్ ఘనంగా నిర్వహించారు. ఉన్నత విద్యా భవిష్యత్తును పునర్ నిర్వహించడానికి ఆవిష్కరణ, వ్యూహాత్మక దృష్టి, పరస్పర సహకారం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. కాన్‌క్లేవ్‌కు ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు ( హెచ్ ఓ డి) లు పాల్గొన్నారు. విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాలు సాధించడానికి అవసరమైన నాయకత్వ లక్షణాలు, ఉత్తమ పద్ధతులు, భవిష్యత్ అవకాశాలపై ప్రముఖ అకాడమిక్ నాయకులు తమ ఆలోచనలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ బాలకిస్టా రెడ్డి, చైర్మన్ - తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ హాజరై ప్రసంగిచారు. నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్య ఆధారిత విద్య (స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్) యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సాంప్రదాయ సిద్ధాంతాత్మక బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో (ప్రాక్టికల్) ప్రయోగాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అవసరమని ఆయన తెలిపారు. అలాగే, ఏవియేషన్ మేనేజ్‌మెంట్ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు విభిన్నమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కోర్సులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్నాయని వివరించారు. విద్యాసంస్థలు (ప్రాక్టికల్ లెర్నింగ్) ప్రయోగాత్మకంగా నేర్చుకుంటేనే ఇండస్ట్రీ అలైన్‌మెంట్, సామాజిక బాధ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేసారు. అంతే కాకుండా విద్యాసంస్థల నిర్మాణం, నిర్వహణలో ఎదురయ్యే సవాళ్ల, మార్గదర్శకాలపై ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్న ప్యానెల్ చర్చ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కాంక్లేవ్ కార్యక్రమంలో డాక్టర్ జి ఎస్ వి ఆర్ కె చౌదరి ప్రిన్సిపాల్ బద్రుక కాలేజ్, డాక్టర్ నీతూ ప్రిన్సిపాల్ ఎల్బీనగర్ బ్రాంచ్ (అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్), డాక్టర్ బి మోహన్ కుమార్ ప్రిన్సిపల్ బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ (బిసిసిఏ) హైదరాబాద్, డాక్టర్ రాధిక హరినాథిని ప్రిన్సిపల్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్స్ (టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ డి సి డబ్ల్యూ ) ఇబ్రహీంపట్నం పనేలిస్టులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ అభిరామ కృష్ణ (డైరెక్టర్ జనరల్, బద్రుకా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, హైదరాబాద్) మోడరేటర్‌గా వ్యవహరించారు. ప్యానెల్ చర్చలో విద్యాసంస్థల నిర్మాణంలో ఉన్న సవాళ్లు, నాణ్యమైన విద్య అందించడంలో ఎదురయ్యే సమస్యలు, విద్యార్థుల నాణ్యత, వారి దృష్టి కేంద్రీకరణ స్థాయి వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల దృష్టి మరల్చే అంశాలు పెరుగుతున్న నేపథ్యంలో, వారి దృష్టి స్థాయి తగ్గిపోతున్నదని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సరికొత్త బోధనా విధానాలు, అనుభవాత్మక అభ్యాస పద్ధతులు, సాంకేతికత వినియోగం అవసరమని నిపుణులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి దాసరి, ప్రెసిడెంట్ - హెచ్ ఆర్, జాస్పర్ ఇండస్ట్రీస్, వైస్ ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్. శైలేష్ సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, డైరెక్టర్ డాక్టర్. ఎస్ వి. రమణా రావు, వివిధ కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాల్లు తదితరులు పాల్గొన్నారు.

## అమీన్పూర్‌లో భారీ కూల్చివేతలతో
# ప్రభుత్వ భూములను కాపాడుకునే చర్యలు

### రెవెన్యూ, హైడ్రా సిబ్బంది సుమారు 2,000 మందితో ఆపరేషన్

**అమీన్‌పూర్, ఏప్రిల్11 (నినాదం):** మండలం లోని శనివారం ఉదయం, సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో నిర్వహించిన భారీ కూల్చివేతలు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో రెవెన్యూ, హైడ్రా సిబ్బంది, పోలీసు బందోబస్తు కలిపి సుమారు 2,000 మంది పాల్గొన్నారు. ఐలాపూర్లో అనుమతులు లేకుండా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. న్యాయవాది గెస్ట్ హౌస్ కూడా కూల్చివేతకు గురయ్యింది ఇంకా, 1998 నుండి కోర్టు స్టే ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన న్యాయవాది ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్ ను కూడా అధికారులు కూల్చివేశారు. ఈ చర్యతో కబ్జాదారులు పగ్గం కోల్పోయినట్లయ్యారు కిష్టారెడ్డిపేటలో నివాసీకులకు షాక్ 45 కుటుంబాలకు ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ కిష్టారెడ్డి పేటలోని కేపీ రెసిడెన్సీ, క్రిస్టల్ డెవలపర్స్ భవ నాల్లో నివసిస్తున్న 45 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. అనుమతులు లేకుండా నిర్మించిన ఈ భవనాల్లో నివసిస్తున్న వారిని అధికారులు రాత్రి తర్వాతి దశలో తరలించారు. ప్రభుత్వ భూములపై కబ్జాలను తొలగించేందుకు హైడ్రా ఆపరేషన్ ఈ చర్యలు, ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలను తొలగించేందుకు చేపట్టిన హైడ్రా చర్యల్లో భాగంగా ఉన్నాయి.







## ఘనంగా పూలే 199వ జయంతి వేడుకలు



**కమలాపూర్, ఏప్రిల్ 11 (నినాదం):** మండల కేంద్రంలో ని స్థానిక బస్టాండ్ కూడలి మహాత్మా జ్యోతిరావు పూలే 199 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.పూలే మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు.విద్యకుఖ కొత్త మార్గాలను చూపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కోలుగూరి రాము, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ శనిగరపు వంశీ, మాట్ల రమేష్. మౌటం కుమార స్వామి, పుల్ల శోభన్ బాబు,వార్డు సభ్యులు పుల్ల శ్రీనివాస్, పుల్ల ఐలయ్య , జన్ను స్వప్న భిక్షపతి,మాట్ల రవీందర్, ఎస్ డి అంకూస్,ఎం ఆర్ పి ఎస్ నాయకులు చిలువేరు సంపత్, అకునూరి సాంబయ్య , పుల్ల శంకర్ ,బండి లక్ష్మణ్, కొండపాక మనీష్ ,పుల్ల పున్నం చందర్,నద్దునూరి ప్రసాద్ శనిజరపు పవన్, కొయ్యడ సునీల్, పులి వెంకట రమణ, కొలుగురి హవీష్ కొయ్యడ అక్షయ్ ,గుంపుల అశోక్, , కొయ్యడ రమేష్, కోలుగూరి సాయి నవనీత్, మాట్ల అన్వేష్, మాట్ల వంశీ, గిన్నారపు సుందర్, మాట్ల రుషి నందన్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బడిబాట




**అమరచింత, ఏప్రిల్ 11, (నినాదం):** అమరచింత మండలం మస్తిపురం నందిమల్ల ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్ ఎం వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మస్తిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతోర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ముందస్తు బడిబాట కరపత్రాలను విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గ్రామ పెద్దల సమక్షంలో బడిబాటకు సంబంధించిన కర పత్రాలు విడుదల చేసినట్లు తెలిపారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశం ప్రకారం నిర్వహించామని తెలిపారు. అనంతరం నందిమల్ల యుపిఎస్ పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థులను తమ జెడ్పి హైస్కూల్లో చేర్చాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు ప్రభాకర్ రామన్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఎంపీ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన తెలిపాం



**అమరచింత, ఏప్రిల్ 11(నినాదం):** ప్రజాస్వామ్య పద్ధతిలో పాలమూరు ఎంపీడీకే అరుణ పర్యటనను అడ్డుకున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి ముదిరాజ్ రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ అమరచింత పెద్ద చెరువు సుందరీ కరణ పనులు మంత్రి వాకిటి శ్రీహరి చేసిన తర్వాత రెండోసారి చేయడం పట్ల తాము అభ్యంతరం తెలిపామన్నారు.కార్యకర్తలను రౌడీ మూకలని తాగుబోతులని పరుష పద జాలం వాడడం ఆమె విజ్ఞత కే వదిలేస్తున్నామన్నారు. మంత్రిని ఉద్దేశించి ఎంపీ మాట్లాడిన మాటలు సరికాదన్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లు కూడా మహిళలే కదా మీకు నిన్న జరిగిన కార్య క్రమం లో వాళ్ళు లేకుండా పూజా కార్యక్రమం ఏలా చేస్తారు. మీకు ఒక న్యాయం ఎదుటి మహిళలకు న్యాయమా అని ప్రశ్నించారు . ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కేవలం బీసీ మంత్రి పై అగ్రవర్ణ కుల దురాహంకారాన్ని ప్రదర్శించడం మీకే చెల్లిందన్నారు. బీసీ మంత్రి ఎదుగుదల ను ఓర్వ లేక చిల్లర వేషాలు వేస్తూ కాంగ్రెస్ పార్టీ నీ అబాసు పాలు చెయ్యాలనుకుంటే నిన్న జరిగిన పరాభవం మళ్ళీ ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. చేత నైతే అభివృద్ధి లో పోటీ పడాలని సూచించారు. కొబ్బరికాయ లు కొట్టడం లో కాదు అని హితవు పలికారు. కాంగ్రెస్ కార్యకర్తల మీద అక్రమ కేసులను ఖండిస్తున్నామన్నారు.

# అక్రమ షెడ్ల రాజ్యం... అధికారుల నిర్లక్ష్యమేనా?

### పెద్దలపై మౌనం...
### చిన్న వ్యాపారులపై కఠిన చర్యలు!
### రోడ్లను మింగేస్తున్న నిర్మాణాలు...
### ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు

**కోదాడ, ఏప్రిల్ 11(నినాదం):** కోదాడ పట్టణంలో వ్యాపార రంగం వేగంగా విస్తరిస్తున్న వేళ, అక్రమ నిర్మాణాలు కూడా అదే వేగంతో పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట, ముఖ్యంగా హుజూర్‌నగర్ రోడ్‌లో వ్యవసాయ మార్కెట్ సమీపంలో అనుమతులు లేకుండా భారీ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇదే తరహాలో




మేళ్లచెరువు రోడ్‌లో సుమారు 500 నుంచి 600 గజాల విస్తీర్ణంలో రెండు భారీ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకునే చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే ఇదే సమయంలో రహదారుల పక్కన తోపుడు బండ్లపై జీవనం సాగించే చిన్న వ్యాపారులపై మాత్రం అధికారులు కఠిన చర్యలు తీసుకుంటుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. చిన్న వ్యాపారులపై అకస్మాత్తుగా దాడులు, సరుకుల స్వాధీనం వంటి చర్యలు చేపడుతుండగా, పెద్ద స్థాయి వ్యాపారులు, ప్రభావశీలుల విషయంలో మాత్రం అధికారులు మౌనం పాటించడం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది.చిన్నవారిపై కఠినత్వం... పెద్దవారిపై మౌనం" అనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇది అధికార యంత్రాంగంపై నమ్మకాన్ని దెబ్బతీస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అక్రమ నిర్మాణాల వల్ల రహదారుల వెడల్పు తగ్గిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు "షెడ్లకు ప్రత్యేక అనుమతి అవసరం లేదు" అని చెప్పడం మరింత వివాదాస్పదంగా మారింది.ఈ పరిస్థితుల నేపథ్యంలో, అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి






### ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. అరీవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 2కే రన్ వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత డ్రైవింగ్‌తో పాటు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా సమాజానికీ హానికరమని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఇందుకోసం హెల్ప్‌లైన్ నంబర్: 8712658111 అందుబాటులో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య , వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీనివాస్ డీఎంహెచ్వో మధుసూదన్, అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు ఆలస్యంపై ఆగ్రహం... రోడ్డెక్కిన రైతులు

**కోదాడ,ఏప్రిల్ 11(నినాదం):** కోదాడ పరిసర ప్రాంతంలోని తమ్మర వద్ద శనివారం రైతులు, అఖిలపక్ష పార్టీలు, రైతు సంఘాల నాయకులు కలిసి కోదాడ--ఖమ్మం రహదారిపై ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజుల తరబడి వేచి ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఈ ఆలస్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు కమిషన్ ఏజెంట్లు, దళారులు, మిల్లర్లు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్లు ప్రారంభించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని



హెచ్చరించారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.రహదారిపై ధర్నా కారణంగా ప్రయాణికులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో బొల్లు ప్రసాద్, కనగాల నారాయణ, దొడ్డ వెంకటయ్య, కమతం రాజేశ్వరరావు, వీరేపల్లి కృష్ణమూర్తి, బొమ్మకంటి వీరబాబు, బైరాబోయిన వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

### అణగారిన వర్గాల అభ్యున్నతికి
## జ్యోతిరావుపూలే కృషి...
### పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి
### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు మహిళల విద్యాభివృద్ధికి విశేషంగా కృషిచేసిన మహానుభావుడు మహాత్మ జ్యోతీరావుపూలే అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలోని ఐ డి ఓ సి లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమానవత్వం సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిరుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్య విశ్వరించడంలో సామాజిక అసమాతలను తొలగించడంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వం పూలే చూపిన మార్గంలోనే పేద బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఇందిరా, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 11 (నినాదం) :** విద్యుత్తుతో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ఎదురుగట్ల శంకరమ్మ (35) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన జరిగింది. మృతురాలి భర్త మల్సూర్ తెలిపిన వివరాలకు మేరకు తమ సొంత వ్యవసాయ భూమిలో శనివారం మిషన్ తో వరికోత కోయిస్తుండగా, విద్యుత్ స్తంభం నుండి మోటారుకు సరఫరా అవుతున్న సర్వీస్ వైర్ అడ్డుగా ఉండటంతో వెదురు కర్రతో పైకి లేపి పట్టుకొనగా ప్రమాదవశాత్తు సర్వీస్ వైర్ జారి పడటంతో విద్యుత్ షాక్ కు గురైందన్నారు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపాడు.మృతురాలికి 11ఏళ్ల కుమారుడు చరణ్ ఉన్నాడు.ఈ సంఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

# ఆరోగ్య సమాజానికి ప్రతిఒక్కరం కృషి చేద్దాం

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 11 (నినాదం):** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ పట్టణం క్లాక్ టవర్ సెంటర్లోప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్నఆరోగ్య వారోత్సవం సందర్భంగా డ్రగ్స్ కంట్రోల్ రెగ్యులేటరీ స్ట్రెన్తెనింగ్ డే జిల్లా డ్రగ్స్ కంట్రోల్ పరిపాలన విభాగం, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో మరియు పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన ర్యాలీని నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తో కలిసి ప్రారంభించారు. మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం సమాజానికి పెద్ద ముప్పుగా మారుతోందని, ముఖ్యంగా యువతను దారి తప్పించే ప్రమాదం ఉందని అన్నారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగాజిల్లా వ్యాప్తంగా 300 మందికి పైగా విద్యార్థులు, డ్రగ్ లైసెన్స్ హోల్డర్లు పాల్గొని మత్తు మందుల వినియోగం, నకిలీ మందుల నియంత్రణ, ఆంటీబయాటిక్ నిరోధకత వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. మందుల కొనుగోలు సమయంలో-ఇ= కోడ్ వెరిఫికేషన్ వంటి సాంకేతిక పద్ధతులను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం పూర్తిగా నిషేధమని, ఫార్మసీలు ప్రభుత్వ



నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని పేర్కొంటూ, ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని తెలిపారు.ఈ ర్యాలీలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఏ ఎస్ పి రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహ రావు. విద్యార్థులు, అధికారులు, పాల్గొన్నారు.

## కోదాడ బైపాస్‌లో బస్సు ప్రమాదం

### ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన ప్రవేట్ బస్సు
### బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం
### ప్రమాదంలో 16 మందికి గాయాలు



**కోదాడ, ఏప్రిల్ 11(నినాదం):** కోదాడ పట్టణ బైపాస్‌లోని జాతీయ రహదారి (ఎన్ హెచ్-65)పై తెల్లవారుజామున తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఇంటర్సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ముందుకు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా, ఢీకొట్టిన ప్రభావంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో 16 మంది ప్రయాణికులు గాయపడగా, వారిని స్థానికులు, పోలీసులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నవ భారత భవితకు మార్గదర్శి పూలే



**నూతనకల్,ఏప్రిల్ 12 (నినాదం):** మహాత్మ జ్యోతిబాపూలే జీవితం ఆదర్శనీయమని నవ భారత భవితకు మార్గదర్శి ఆశయ సాధనకు నేటి యువత నడుచుకోవాలని పలువురు వ్యక్తులు అన్నారు.జ్యోతిబాపూలే 200వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో కుల వర్ణ వివక్షతల నిర్మూలనకు చదువు ఒక్కటే మార్గమని గుర్తించి,ఆ దిశగా కృషి చేసిన మహనీయుడు పూలే అని పేర్కొన్నారు.ఈనాటి కార్యక్రమంలో ఎస్సై నాగరాజు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి,సర్పంచ్ నాగలక్ష్మి గణేష్,చంద్రకళ,అశోక్ సైదులు,బద్రి,దరిపల్లి వీరన్న,వెంకటేష్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పూలే దంపతులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి





### మహనీయుల జయంతి ఉత్సవ మండల కమిటి నాయకులు

**మహాముత్తారం, ఏప్రిల్ 11(నినాదం):** అట్టడుగు వర్గాల కోసం జీవితాలను త్యాగం చేసిన మహాత్మజ్యోతిరావుపూలే దంపతులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మహనీయుల జయంతి ఉత్సవ మండల కమిటి నాయకులు పిలుపునిచ్చారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాల మండల కమిటీ అధ్యక్షుడు లింగమల్ల దుర్గయ్య, గౌరవ అధ్యక్షులు మందల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసోత్సవాల సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాలను పార్టీలకతీతంగా ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. జ్యోతిరావు పూలే వారసులుగా వారి ఆశయాలను సిద్ధాంతాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజంలోని రుగ్మతలను తొలగించి సామాజిక సేవకులుగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆనాటి సమాజంలో బాల్య వివాహాలు, అంటరానితనం, సతీసహగమనంను నిర్మూలించిన సామాజిక వైద్యులని వారు పేర్కొన్నారు. అనంతరం బోర్లగూడెం గ్రామంలో మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాల ప్రతిష్టాపన కొరకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల గౌరవ అధ్యక్షులు లింగమల్ల సడవలిరావు, అధ్యక్షుడు రామగిరి రాజు, ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు పీక కిరణ్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర పుల్ సింగ్, బోర్లగూడెం సర్పంచ్ ధరంసింగ్, వజినపల్లి సర్పంచ్ మహేష్, ప్రేమ్ నగర్ సర్పంచ్ రాజు, స్తంభంపల్లి సర్పంచ్ కీర్తన శ్రీనివాస్, పోలారం సర్పంచ్ రాజబాబు, నిమ్మగూడెం సర్పంచ్ రాజేష్, మహనీయుల జయంతి ఉత్సవాల మండల ఉపాధ్యక్షులు ముక్కెర రాజమల్లు, జాటోత్ వంశీ రాజ్, ప్రధాన కార్యదర్శి లింగమల్ల శంకర్, మహనీయుల జయంతి ఉత్సవాల మండల కమిటీ సభ్యులు రాధారపు స్వామి, పక్కల రాజబాపు, గంధం రాజు, లింగమల్ల రాజయ్య, వేముల మధూకర్, పోలారం రావణ్, కార్యదర్శి ఉయ్యాల రాజకుమార్, పంగ సంపత్, సీనియర్ నాయకులు బొబ్బిలి వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు ధరంసోత్ సుజాత, ఏఎంసీ డైరెక్టర్ రాజారాం, డిటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఐత తిరుపతి, రాంసింగ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు నిర్మించిన భూమిపై సమగ్ర విచారణ జరిపించాలి

- కుల సంఘాల జేపీసీ నాయకుల డిమాండ్

**మహాముత్తారం, ఏప్రిల్ 11(నినాదం):** మహాముత్తారం మండలం బోర్ల గూడెంలో నిర్మించిన రైస్ మిల్లు భూమిపై సమగ్ర విచారణ జరిపించాలని కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ అజ్మీర పూల్ సింగ్ మాట్లాడుతూ రైస్ మిల్లు నిర్మాణం జరిపిన మిల్లు పక్కనే ఫారెస్ట్ సరిహద్దు ఉందని వెనుకనే చెరువు, చెరువు శిఖం భూమి ఉందని అటువంటి సందర్భంలో ఈ రైస్ మిల్లుకు పర్మిషన్ ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. మిల్లు యజమానులు అటవీ శాఖకు చెందిన ఫారెస్ట్ భూమిని ఒక ఎకరం ఆక్రమించుకున్నారని దీనిపై చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారికి



ఫిర్యాదు చేశామని వివరించారు. రెవెన్యూ శాఖ అధికారులు గ్రామపంచాయతీ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదని తెలిపారు ఈ భూమిపై రెవెన్యూ శాఖ అధికారులు అటవిశాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు రామగిరి రాజు, లింగమల్ల దుర్గయ్య, మందల రాజిరెడ్డి, రాధారపు స్వామి, లింగమల్ల సడవల్లి రావు, రాజమల్లు గౌడ్, లింగమల్ల రాజు, బోడ బాలాజీ, పాల్గొన్నారు.



# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

## సమానత్వం, మహిళా విద్యకు మార్గదర్శి పూలే
## టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, ఏప్రిల్ 11 (నినాదం)**

మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, మహిళా విద్య కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలని ఆశించిన గొప్ప సంస్కర్తగా ఆయనను కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, జిల్లాలో డిగ్రీ, జూనియర్ కళాశాలల బాలికలకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను గుర్తుచేశారు. పూలే దంపతుల స్ఫూర్తితో యువ



త సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

జిల్లాలో బీసీ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే రూ.1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ఆల్-ఇన్-వన్ గైడ్స్ అందజేసినట్లు, గత సంవత్సరం పదవ తరగతిలో 99.5 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా గ్రూప్స్, యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్ అందించామని కలెక్టర్ తెలిపారు.బి సి ల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# నేనెవరిని..?

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని కాంగ్రెస్..!
## కాంగ్రెస్ ఎమ్మెల్యేనే బీఆర్ఎస్ క్లారిటీ ఇచ్చేది ఎవరు..?
### పార్టీల చౌరస్తాలో ఎమ్మెల్యే సంజయ్!
### 20న మినీ స్టేడియంలో బహిరంగ సభ



**జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 11 నినాదం**

జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే నే... నా దగ్గరికి వస్తే ఛాయ పోసి మూడు రంగుల కండువా కప్పిన అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. బి ఆర్ఎస్ ఎమ్మెల్యే నే అని స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పు చెప్పారు. రాజకీయ బిక్ష పెట్టిన పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరారని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పచ్చి బూతులు తిట్టి దూరం పెట్టారు. సుప్రీంకోర్టులో కేసు వేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అని మీడియా ముఖంగా అనేక సందర్భాల్లో చెప్పారు . నీది ఏ పార్టీ నీకే తెలియదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనేక సందర్భాల్లో సంజయ్ కుమార్ పై విమర్శలు చేశారు. జగిత్యాల డిసిసి నందయ్య సంజయ్ కుమార్ కచ్చితంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని చెప్తున్నారు. నేను ఇప్పటికీ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే నే కాంగ్రెస్తో కలిసి పనిచేస్తున్న ఎమ్మెల్యే అంటున్నారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధుల మధ్య పొంతన లేని మాటలు కార్యకర్తలను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ఇదంతా చూస్తున్న జగిత్యాల ప్రజానీకం తిట్టిపోస్తున్నారు. న్యాయస్థానం నుంచి తప్పించుకోవడం కోసం విలువ గల నోటి నుంచి తేలికైన అబద్ధాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. చట్టసభకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు పొంతన లేని స్టేట్మెంట్లు ఇచ్చి రాష్ట్ర రాజకీయాలను గందరగోళంలోకి నేడుతున్నారు. సంజయ్ కుమార్ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే అయితే ఈనెల 20న జరిగే కెసిఆర్ సభకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరవుతారా..? స్పీకర్ గడ్డం ప్రసాద్ చెప్పిన తీర్పుకు విలువనిస్తారా..? జగిత్యాల జిల్లాలో ఈ ప్రచారం జోరందుకుంది. నియోజకవర్గం లో బి ఆర్ఎస్ పార్టీ పూర్తి విచ్ఛిన్న మవడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కారణమని జగిత్యాల బి ఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. పార్టీ ఫిరాయింపు వల్ల ఎన్ని తలనొప్పులు వస్తాయని తీవ్రస్థాయిలో డ్యామేజ్ అవుతానని ఎమ్మెల్యే సంజయ్ కూడా ఊహించలేదని అనుచరులు చెప్తున్నారు. అభివృద్ధి పనులంటూ కోట్లాది రూపాయల శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నియోజకవర్గ ప్రజలు పట్టించుకోలే.,. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఎమ్మెల్యేకు తెలియకుండా గుండు పిన్ను కూడా కదలడానికి వీలేదని హుకుం జారీ చేసినట్లు ప్రచారం ఉంది. ఈ రాజకీయ గందరగోళ పరిస్థితులను అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంది. ఉన్నతాధికారుల దగ్గర్నుంచి బిల్ కలెక్టర్ ల వరకు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. సామాన్య ప్రజల నుంచి అందిన కాడికి గుంజుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విపరీతమైన అవినీతి పెరిగిపోయింది. ఎమ్మెల్యే అండదండలతో జగిత్యాల మున్సిపాలిటీని లూటీ చేశారనే మాట వాస్తవం. బాధ్యతారహితమైన ఇన్చార్జి కమిషనర్ ను ఇన్చార్జి మున్సిపల్ చైర్పర్సన్ జత చేసి మున్సిపాలిటీ చరిత్రలో లేనంత అవినీతికి పాల్పడ్డారనేది అనేక అవినీతి సంఘటనలు రుజువు చేశాయి . ఈ అంశం ఎమ్మెల్యే కలిసి పని చేస్తున్న కాంగ్రెస్ పై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్చార్జి కమిషనర్ గా ఉన్న వెటర్నరీ అధికారి పని ప్రదేశంలో ముగ్గురు మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడ్డరని . కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తే సమస్యకు సాక్ష్యాలు లేకుండా చేసి ఇన్చార్జి కమిషనర్ ను కాపాడిన ఘనత ఎమ్మెల్యే ఖాతాలో వేసుకున్నారనే విమర్శలున్నాయి. పైగా అతనికి మహిళా శిశు సంక్షేమ శాఖ అదనపు బాధ్యత లు అప్పజెప్పారు. జిల్లాలో అధికారుల సామర్థ్యంతో పనిలేదు .. జీ..హుజూర్.. అత్యంత చాకచక్యంగా అవినీతికి పాల్పడే నేర్పరి తనం క్రైటీరియాగా చూసి అదనపు శాఖల బాధ్యతలిచ్చి ఇచ్చి సత్కరిస్తారు. ఇదంతా ఎమ్మెల్యే కనుసనల్లోనే జరుగుతుందని అధికారులే చెప్తారు. తెలంగాణ పునర్నిర్మాణం చేసిన కెసిఆర్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని ప్రజలు పక్కన పెట్టారు. నియోజకవర్గంలో 100 కోట్ల అభివృద్ధి అంటూ కంటికి కనబడకుండా చేసే మోసాలను ప్రజలు గమనిస్తే లేరు అనుకోవడం అవివేకమే అవుతుంది. అవినీతి అధికారులను ఎంచుకొని పట్టుబట్టి జిల్లాలో పోస్టింగ్ ఇప్పించుకున్న ప్రతిఫలం ఖచ్చితంగా ప్రజలు మూటగట్టి వచ్చే ఎన్నికల్లో చేతిలో పెట్టడానికి సిద్ధంగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. కమిషనర్ స్థాయిలో ఉన్న అధికారులు కులం కార్డు వాడుతూ అడ్డగోలు అవినీతి చేస్తున్న దృశ్యాన్ని జగిత్యాల పట్టణంలో కళ్లకు కట్టినట్టు కనబడుతుంది. ప్రతి సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే దృష్టిలో ఈ అవినీతి అంశం లేదనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. చట్టసభలకు ఎన్నికైన ఒక ఎమ్మెల్యే అపరిచితుడు లాగా గంటకో మాట, పూటకో పార్టీ,రోజుకో కండువా,తేలికగా అబద్ధాలు ఈ వ్యవహారం అంతా రాష్ట్ర రాజకీయాలను అపహాస్యం చేస్తున్నాయి. చివరి అంకంలో వీటిని భరించలేక మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారడానికి ఇది ఒక బలమైన కారణం అని చెప్తున్నారు. రాజకీయ పార్టీలను కార్యకర్తలను నిర్వీర్యం చేసి గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టిన ఎమ్మెల్యే వ్యవహారం విమర్శల పాలవుతుంది. ఎమ్మెల్యే పదవి కాలం ఇంకా రెండు సంవత్సరాలు ఉంది. అప్పటివరకు నియోజకవర్గంలో ఇలాంటి రాజకీయ గందరగోళ పరిస్థితులు ఉండబోతున్నాయా..? టిఆర్ఎస్ లో చేరిన జీవన్ రెడ్డి ఈ పరిస్థితులను ఏ విధంగా చక్క దిద్దుతారు..? ప్రజల మధ్య నుంచి తన గొంతును ఏ విధంగా వినిపిస్తారనేది ఆసక్తిగా మారింది.

**ఈ నెల 20న మినీ స్టేడియంలో బహిరంగ సభ!**

ఈనెల 20న బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీలో చేరనున్నారు. ఇందుకోసం జగిత్యాల పట్టణంలోని మినీ స్టేడియంలో బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి పక్కా చేశారు. సభ ఏర్పాట్ల కోసం జిల్లా బిఆర్ఎస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. బి ఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభకు హాజరు కాలేక పోవడం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు అత్యంత సంకటంగా మారిందనే చర్చ నడుస్తుంది

# అభివృద్ధే మా అజెండా.. రాజకీయాలకు తావులేదు



## మున్సిపాలిటీకి రూ.58.95 కోట్లు కేటాయించాం
### పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం
### లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం ప్రతినిధి, ఏదులాపురం, ఏప్రిల్ 11(నినాదం)**

ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

**రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం**

వరంగల్ క్రాస్ రోడ్డు ఆటోనగర్ నుంచి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి



భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 32 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.58.95 కోట్లు కేటాయించిందన్నారు. ఆటోనగర్ మీదుగా సాగే ఈ రహదారి పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు.

**ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం..**

గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. "ప్రజా పాలన మొదటి ఏడాదిలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తాం" అని ప్రకటించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు ఏటా రూ.24 వేల కోట్ల మేర వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వివరించారు.

**లబ్ధిదారులకు బాసట**

ఖమ్మం రూరల్ మండలం, మున్సిపాలిటీ పరిధి



లోని 64 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 227 మందికి రూ.70.42 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ వంటి హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు

# సుద్ధ ముక్కపై మహాత్మ జ్యోతిరావు పూలే



**కోదాడ, ఏప్రిల్ 11(నినాదం):**

కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నరేష్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అంగుళం సుద్ధ ముక్కపై ఆయన ప్రతిమను చెక్కి కళాత్మకతతో ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. నరేష్ చారి గతంలో సూక్ష్మ వస్తువులు బియ్యం పప్పు చింత గింజలు పెన్సిల్ మొనపై కళాఖండాలు చెక్కి పలువురు మన్ననలను పొందాడు. అద్భుతాలు సృష్టిస్తున్న చారిని స్థానికులు అభినందించారు.

# స్వయంభు టీజర్‌కు భారీ స్పందన




టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్



పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు.

NINADAM CINEMA

# ఓటిటిలోకి యూత్ మూవీ

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ప్లిక్స ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్



హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం.

# ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుకలో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాకస్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.







# ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్

బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మహాకాళేశ్వర ఆలయంలో జరిగే క్రతువుల్లో భస్మ హారతికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతిరోజూ తెల్లవారుజామున 3:30 నుండి 5:30 గంటల మధ్య బ్రహ్మ ముహూర్తంలో ఈ పూజను నిర్వహిస్తారు. ఆలయ తలుపులు తీసిన వెంటనే స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, చక్కెర, తేనెతో కూడిన పంచామృత అభిషేకం చేస్తారు.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787